విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

సోమవారం 01 సెప్టెంబరు 2025 | 8 పేజీలు

అటకెక్కిన హామీలు

- పడకేసిన బుడమేరు ఆధునికీకరణ
- అమలు చేయడంలో సీఎం చంద్రబాబుకు చిత్తశుద్ధిలేదు
- నిధులు కొరత అంటూ మంత్రి వ్యాఖ్యలు హాస్యాస్పదం
- మూడు జిల్లాల లక్షలాది ప్రజల ప్రాణాలతో చెలగాటమా..?
- సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆగ్రహం

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం చంద్రబాబుకు చిత్తశుద్ధిలేదని, మూడు జిల్లాలతో ముడిపడి ఉన్న బుడమేరును పట్టించుకోకుండా ప్రక్కన పెట్టేశారని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఫైర్ అయ్యారు. బుడమేరు ముంపుతో విజయవాడ ప్రజలు సర్వం కోల్పోయి సంవత్సరం అవుతున్న సందర్భంగా ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆపరేషన్ బుడమేరు, పూడికతీత పనులను చేపట్టి ఆధునీకరిస్తామని సీఎం చంద్రబాబు స్వయంగా ప్రజలకు ఇచ్చిన హామీలు నీటిమూటలుగానే మిగిలిపోయాయని ఎద్దేవా చేశారు. ఈ సంవత్సర కాలంలో బుడమేర పరివాహక ప్రాంతం దాదాపుగా 167కిలో మీటర్లు పర్యటించి ముంపుకు గల కారణాలను క్షుణ్ణంగా

పరిశీలించి అనేక పోరాటాలు, ఉద్యమాలు చేపట్టామని, అంతేకాకుండా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ నాయకత్వంలో స్వయంగా సీఎం చంద్రబాబును కలిసి నివారణ చర్యలను చిత్రాలను ప్రదర్శించి, లిఖితపూర్వకంగా వివరించడం జరిగిందన్నారు. దీంతో సీపీఐ పోరాటంతో లక్షలాదిమంది ప్రజలకు న్యాయం జరుగుతోందని భావించామని, నెలలు గడుస్తున్న బుడమేరు ఆధునీకరణ పనులు చేపట్టకపోవడం దారుణమన్నారు. కేవలం 450 మీటర్ల సైడ్ గోడను నిర్మించి బుడమేరు ముంపును పూర్తి స్థాయిలో అరికట్టామని పెద్దఎత్తున ప్రచారం చేసుకోవడం తప్పితే శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇది కేవలం ఒక్క విజయవాడ సమస్యకాదని, మూడు జిల్లాల్లో ఉన్న 80లక్షల ప్రజ జీవితాలతో ముడిపడి ఉన్న సమస్య అన్ని రకాలుగా నష్టపోతున్నవారికి న్యాయం చేయరా అని నిలదీశారు. ఆధునీకరిస్తామని చెప్పడం తప్పితే సమస్య పరిష్కారం కోసం బుడమేర కాలువ వెంబడి ఉన్న ఆక్రమణలు పూడికతీతలు తొలగించకుండా ఆపరేషన్ బుడమేరు ఎలా సాధ్యమవుతందని ప్రశ్నించారు. జిల్లాలోని ఎనికేపాడు అండర్‌టన్నెల్ నుండి 14వేల కూస్కెక్కులు నీరు దిగువుకు వెళ్లవలసి ఉండగా ఆక్రమణలతో పెద్ద ఎత్తున పూడుకుపోయిన కాలువ

మిగతా 2 లో

15లోపు స్మార్ట్ రేషన్ కార్డుల
పంపిణీ పూర్తి: మంత్రి

విశాలాంధ్ర-తెనాలి : తమ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 1.46 కోట్ల లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసినట్లు పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 15లోపు రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికీ కార్డుల పంపిణీ పూర్తి చేస్తుందని చెప్పారు. ఆదివారం తెనాలి పట్టణం, మండల ప్రాంతాలలోని ప్రజలకు ఇంటింటికి వెళ్లి లబ్దిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ రాష్ట్రంలోనే నాలుగు కోట్ల మందికి పైగా ప్రజలకు రేషన్ కార్డు సేవలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నామన్నారు. మహిళలకు దీపం-2 పథకం ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పిన హామీ ప్రకారం అందరికి సిలిండర్లు సబ్సిడీ అందజేస్తున్నామని వివరించారు. ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. లబ్దిదారులను గుర్తించే విషయంలో రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని, ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్డులోని క్యూఆర్ కోడ్ స్కాన్‌చేస్తే లబ్దిదారుడు ఎప్పుడు సరుకులు తీసుకున్న సమాచారం వెంటనే ప్రభుత్వానికి చేరుతుందన్నారు. రాష్ట్రంలోని 29వేల చౌకధరల దుకాణాల ద్వారా కందిపప్పు, పామాయిల్, గోధుమలు ప్రజల అవసరాన్ని బట్టి పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఏవైనా సందేహాలుంటే టోల్‌ఫ్రీ నెం. 1967 ద్వారా

మిగతా 2 లో

పేదలకు అండగా సీపీఐ

గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి

విశాలాంధ్ర-పెదకాకాని : భారత కమ్యూనిస్టు పార్టీ పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన ఆయన ఆదివారం మండల పరిధిలో పర్యటించారు. పెదకాకాని, వెనిగండ్ల గ్రామాలలోని సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెనిగండ్ల బుడగ జంగాల కాలనీని సందర్శించి అక్కడ వారి స్థితిగతులను విచారించి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ బుడగ జంగాలను ఎస్సీలుగా గుర్తించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ సర్టిఫికెట్లు వారికి ఇస్తూ ఉండేవారన్నారు. అయితే రాష్ట్రం విడిపోయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో బుడగ జంగాలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రం ఇవ్వకపోవడం వలన వారి పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడి నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని బుడగ జంగాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. అంతేకాకుండా వారికి ఇళ్లు లేకపోవడం వలన వారు నివసించే కాలనీ ప్రక్కన వేసిన లేఔట్లలోని ఖాళీ స్థలాలలో తలదాచుకొనుట కోసం పట్టాలు, గుడ్డ ముక్కలతో గుడారాలు నిర్మించుకొని ఆ గుడారాలలో తలదాచు కుంటూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు పట్టణాలలో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు ఇవ్వటంతో పాటు గృహ నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా నిరుపేదలైన ఈ బుడగ జంగాల కాలనీవాసులకు వెంటనే మూడు సెంటు స్థలం కేటాయించడంతోపాటు రూ.5 లక్షలతో ప్రభుత్వమే గృహ నిర్మాణం చేపట్టి గృహం నిర్మించి వారిని ఆదుకోవడంతో పాటు ఎస్సీ కులానికి సంబంధించిన బుడగ కులాలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రం అందించే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కేతినేని అగస్టీన్, వెనిగండ్ల సీపీఐ కార్యదర్శి షేక్ బాజీదు, సహాయ కార్యదర్శి సొలస వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం: కలెక్టర్

విశాలాంధ్ర-విజయవాడ: చిన్నారులు, యువత సైకిల్ సవారీని అలవాటుగా చేసు కొని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవ డంతో పాటు కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వా ములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా అమరావతి రన్నర్స్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో పెడల్ ఫర్ ఫిట్నెస్ అండ్ యూనిటీ ఇతివృత్తంతో నిర్వహించిన సైకిల్ రైడ్‌లో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. డా. బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం నుంచి ప్రారంభమైన ఈ రైడ్ బెంజ్ సర్కిల్, రామవరప్పాడు, బీఆర్టీఎస్ రోడ్డు, గాంధీనగర్, మునిసిపల్ ఆఫీస్, ప్రకాశం బ్యారేజ్, కంట్రోల్ రూమ్, స్టేడియం వరకు మొత్తం 21 కి.మీ. మేర సాగింది. దాదాపు 80 మంది

మిగతా 2 లో

కూటమి ప్రభుత్వంలో
బీసీలపై వివక్షత

క్రాంతికుమార్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: కూటమి ప్రభుత్వం బీసీలపై వివక్షత చూపుతోందని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక చుట్టుగుంటలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి గత ఎన్నికల్లో బీసీలు అండగా నిలిచారని, కానీ బీసీలపై కపట ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. బీసీలకు ఇచ్చిన హామీలు ఏమైనాయి అని ప్రశ్నించారు. ఎన్నికల

మిగతా 2 లో

మహోన్నత నాయకుడు సురవరం: సంతాపసభలో వక్తలు — 2లో

వాణిజ్య పన్నుల ఉద్యోగాలకు అండగా ఉంటా: శ్రీనివాస్ — 7లో

విశాలాంధ్ర

మొదటి పేజీ తరువాయి

అటకెక్కిన హామీలు

ద్వారా కేవలం 4వేల కూసెక్కులు నీరు మాత్రమే దిగువకు వెళ్తోందన్నారు.. ఈ బుడమేరు వెంబడి దాదాపుగా 20వేల కూసెక్కులు నీరు దిగువకు వెళ్లే సామర్థ్యం ఉన్నా పాలకులు, అధికారులు అసమర్ధతతో పూర్తిస్థాయిలో దిగువకు నీరు చేరుకోని పరిస్థితి దాపురించిందన్నారు. దీంతో ప్రజలు పలు దఫాలుగా తీవ్ర నష్టానికి గురై సర్వం కోల్పోతున్నారని వివరించారు. ఎక్కడో ఏ కొండూరులో పుట్టిన బుడమేరు ఎగువన పలు ప్రాంతాల ప్రవహిస్తూ కేసరపల్లి, మంతెన, వేల్పూరు, ఉప్పులూరు, గుడివాడ, కొల్లేరు నుండి సముద్రంలోకి కలుస్తోందని తెలిపారు.

పెద్దఎత్తున పూడుకుపోవడంతో ఎగువన ప్రవహించే వరదతో బుడమేరు దిగువన ఉన్న ప్రాంతాలు ముంపుకు గురవుతున్న పరిస్థితి నెలకొందన్నారు. ఈ కారణంగా యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నా, సమస్యను ప్రక్కదారి పట్టిస్తూ ప్రజలకు తీరని నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఆపరేషన్ బుడమేరు అమలు చేయడానికి నిధులు కొరత ఉందని స్వయంగా నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామనాయుడు మాటలు హాస్యస్పదంగా ఉన్నాయని అన్నారు.

దాదాపుగా రూ 80వేల కోట్లు పలు విధాలుగా అప్పులు తీసుకుని అమరావతి రాజధాని నిర్మాణానికి ఖర్చుచేస్తున్నారని, లక్షలాది ప్రజలకు తీరని నష్ట కలుగజేస్తున్న బుడమేరును ఆధునీకరించడానికి నిధులేవా అని ప్రశ్నించారు. అప్పులో అప్పు కేవలం రూ.5వేల కోట్లు ఆపరేషన్ బుడమేరును అమలు చేస్తే లక్షలాది ప్రజలు సుభిక్షంగాను, క్షేమంగా ఉంటారని అన్నారు. ప్రజలకు మీరు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసే దిశగా పనులు చేపట్టాలని లేనిపక్షంలో ప్రతిసారి బుడమేరుతో నష్టపోతున్న ప్రజల పక్షంగా కొంతుకై సీపీఐ పక్షంగా పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని దోనేపూడి శంకర్ హెచ్చరించారు.

15లోపు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పూర్తి

సంప్రదించవచ్చని చెప్పారు. కేంద్రసహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ భారతదేశంలో ఎక్కడాలేని విధంగా స్మార్ట్ రేషన్ కార్డులను రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటిసారిగా అమలులోకి తెచ్చిందన్నారు. పెన్షన్లు రూ.4వేలు అందించడం అనేది యావత్ దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోనే జరుగుతుందన్నారు. తల్లికి వందనం ద్వారా ఒకే రోజున పదివేల కోట్లను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడికి దక్కుతుందన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ.3,175 వేల కోట్లకు పైగా నగదును అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అమరావతి, పోలవరం, రోడ్లు మరమ్మతులు, నిర్మాణాలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం: కలెక్టర్

సైక్లిస్టులు ఉత్సాహంగా పాల్గొని ఐక్యతా మార్గంలో క్రీడాస్ఫూర్తిని చాటిచెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే సైక్లింగ్ ను హాబీగా మార్చుకొని ముందుకువెళ్లాలని, ఓ మంచి అలవాటు ఎన్నో విజయాలకు సోపానమవుతుందని పేర్కొన్నారు. అందుకే అవగాహన పెంచుకొని సైక్లింగ్ ను అభిరుచిగా మార్చుకోవాలని కలెక్టర్ సూచించారు. లండన్ బి ఎడిన్బర్గ్ బి లండన్ (ఎల్ ఈ ఎల్) సైక్లింగ్ ఈవెంట్ బి 2025లో పాల్గొన్న నిషికాంత్ ను కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో అమరావతి రన్నర్స్ ప్రెసిడెంట్ ఆర్.రమేష్ రవి, సభ్యులు బసవేశ్వరరావు, జీవీ సత్యనారాయణ, నిషికాంత్ తదితరులతో పాటు సీవైసీవో, డెకథ్లాన్ సైక్లింగ్ క్లబ్స్ సభ్యులు, సిటీ రన్నర్స్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో బీసీలపై వివక్షత

ముందు బీసీలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీసీలపై అనేక దాడులు జరిగాయని అన్నారు. కూటమి పాలనలో బీసీలపై జరిగిన దాడులకు సంబంధించి శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుందని, కూటమి ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో చెప్పిన బీసీల రక్షణ చట్టం, బీసీల కుల గణన ఏమైందని ప్రశ్నించారు. ఏడాదిన్నర పాలనలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమని అన్నారు. కుల గణన జరిగితేనే బీసీలకు సరేనా రిజర్వేషన్ దక్కుతుందన్నారు. తక్షణమే కుల గణన చేపట్టి, బీసీల రక్షణ చట్టాన్ని అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే కలెక్టర్ కార్యాలయాలు ముట్టడి, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు రామకృష్ణ, కొల్లూరి హనుమంతరావు, తురక రమేష్, కోలా మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత నాయకుడు 'సురవరం'

సంతాప సభలో వక్తలు

విశాలాంధ్ర-తెనాలి : ప్రజాకళలు సాహిత్యం తోనే ప్రజల్లో మార్పు తీసుకురావాలని అందుకు ప్రజా నాట్యమండలి కళాకారులు, అభ్యుదయ రచయి తలు కళారూపాలను తయారుచేయాలని, ప్రదర్శిం చాలని పదే పదే ఇష్టా సభల్లో సీపీఐ అగ్రనేత కీ.శే. సురవం సుధాకర్‌రెడ్డి హితవు పలికేవారని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, అధ్యక్షులు బొల్లిముంత కృష్ణ చెప్పారు. తెనాలి ఇస్లఫ్ సమావేశ హాలులో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సుధాకర్ రెడ్డి సంతాప సభలో వారు మాట్లాడారు. సభకు తెనాలి నియోజకవర్గ సీపీఐ సహాయ కార్యదర్శి తుంగా బాలస్వామి అధ్య క్షత వహించారు. రామారావు మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన మహోన్నత నాయకుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా స్థాయి నుండి జాతీయ కమ్యూనిస్టు నాయకునిగా ఎదిగిన ఆదర్శనేత సురవరం అన్నారు. పీడిత, తాడిత వర్గాల అభ్యున్నతి కోసం చివరి క్షణం వరకు పోరాడిన పేదప్రజల నాయ కుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. కమ్యూనిస్టు పార్టీ భావజాలాన్ని నిర్మించ దంలో తనకు తానే సాటి అన్నారు. జాతీయ అంతర్జాతీయ ఇష్టా కార్యక్ర మాల్లో పాల్గొని వారికి ప్రోత్సాహమందించార న్నారు. వ్యక్తిగా సౌమ్యుడు, స్నేహశీలి అన్నారు. సమసమాజ స్థాపనే ధ్యేయంగా సేవలందించార న్నారు. అరసం జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం తన జీవితాంతం పోరాడిన మహోన్నత నాయకుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. పేదల హక్కుల కోసం ఎన్నోసార్లు జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. జాతీయస్థాయి నాయకునిగా ఎదిగిన సుధాకర్‌రెడ్డి తన కృషి, త్యాగం, నిబద్ధతతో ఎర్ర జెండా విలువలను నిలబెట్టారన్నారు. ఆయన ఆశయాలను, సిద్ధాంతాలను పుణికిపు చ్చుకోవాలన్నారు. జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో ఆయన చూపిన త్యాగ పథం అందరికీ మార్గదర్శకమ న్నారు. అధ్యక్షత వహించిన సీపీఐ సహాయ కార్యదర్శి తుంగా బాలస్వామి మాట్లాడుతూ ఆయన జీవిత విశేషాలను త్యాగాలను తెలుసుకున్నానని చెప్పారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేశారని వివరించారు. జాతీయకార్య దర్శిగా, ఎం.పి.గా పనిచేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. వారి ఆశయాలను కొనసాగిద్దామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పరచూరి వెంక టేశ్వరరావు, బొల్లిముంత కృష్ణ మాట్లాడారు. సభాప్రారంభంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా గాయకులు పాటలు గానం చేశారు.

కోటప్పకొండపై సీతాఫల విత్తన బంతులు

విశాలాంధ్ర-నరసరావుపేట : ప్రకృతి పరిరక్షణలో భాగంగా 'సేవ్ ఎర్త్ - సేవ్ లైఫ్' సంస్థ ఆధ్వర్యంలో కోటప్పకొండపై సీతాఫల విత్తన బంతులను వెదజల్లే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం అడవి జంతువులు, వన్యప్రాణులు, పక్షుల ఆహార అవసరాలను తీర్చడానికి ఉద్దేశించబడింది. సంస్థ స్థాపకుడు డాక్టర్ నాగిరెడ్డి గోగుల్ నేతృత్వంలో నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని విత్తన బంతులను వెదజల్లారు. కోటప్పకొండ ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్, అటవీ శాఖ అధికారులు, వారి సిబ్బంది, కేంద్ర, రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీత డాక్టర్ ప్రకృతి ప్రకాష్, 'సేవ్ ఎర్త్ - సేవ్ లైఫ్' బృందం సభ్యులు అందరూ ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ అడవి జంతువులు, వన్యప్రాణులు, పక్షులు ఆహారం కోసం కోటప్పకొండ అడవి ప్రాంతంలో విత్తన బంతులను వెదజల్లడం జరిగిందని తెలిపారు. 'సేవ్ ఎర్త్ - సేవ్ లైఫ్' సంస్థ ఇటీవలే కొన్ని సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణలో ముఖ్య పాత్ర పోషిస్తూ, వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోందని అన్నారు.

తాగునీరు అందించండి మహాప్రభో: సీపీఐ

విశాలాంధ్ర-పెదకాకాని : స్థానిక సీపీఐ కార్యాలయంలో పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ పెదకాకానిలో కురిసిన వర్షం వలన వాటర్ స్టోరేజ్ ట్యాంకు కట్ట తెగి పక్కనే ఉన్న మురుగు చెరువులోని నీరు వాటర్ స్టోరేజీలో కలవటం వలన నీరు కలుషితమయ్యాయని, అప్పటినుండి రోజు మార్చి రోజు గ్రామ ప్రజలకు నీటిని విడుదల చేస్తూ ఉన్నారన్నారు. అయితే ప్రతిరోజు పాతూరు ఒకటో వార్డులో ఉదయం నీరు వదలటం జరుగుతూ ఉంటుందన్నారు. రెండు రోజులకు ఒకసారి వదిలే నీరు వదిలినప్పటికీ ప్రతి ఇంటిలోని పంపులో చుక్క నీరు కూడా రాకపోవటం వలన పాతూరులోని ప్రజలు ఇండ్ల ప్రక్కన ఉన్న బోర్లు వేయించుకున్న ఇండ్లకు వెళ్లి బ్రతిమిలాడుకొని నీరు పట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ఎందుకంటే ఊరులోని ఊట బావులన్నిటిని శుభ్రం చేయకపోవడం వలన బ్లీచింగ్ వేయకపోవడం వలన బావులలోని నీరు కలుషితమై వాడుకకు పనికిరాకుండా ఉండుటవలన గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తూ ఉందని చెప్పారు. ప్రజలు రోగాల బారిన పడుచున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు చెరువు కట్టకు మరమ్మత్తులు చేపట్టి చెరువులో కలుషితమైన నీటిని బయటకు పంపి స్టోరేజి ట్యాంకులో శుభ్రమైన నీటిని నింపి సకాలంలో గ్రామ ప్రజలకు అవసరాలకు తగువిధంగా నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు కేతినేని అగస్టీన్, బొట్టు శ్రీనివాసరావు, బట్టు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దంత సమస్యలపై అవగాహన తప్పనిసరి

దంత వైద్యనిపుణులు డాక్టర్ ప్రత్యూష

విశాలాంధ్ర- గుంటూరు వైద్యం : నేటి ఆధునిక జీవన సరళి నేపథ్యంలో దంత సమస్యల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటం ఎంతైనా అవసరమని సీనియర్ దంత వైద్య నిపుణులు డాక్టర్ కొండా ప్రత్యూష అన్నారు. అవగాహన సంస్థ ఆధ్వర్యంలో అరండల్ పేటలోని అవగాహన కార్యాలయంలో 'దంత సమస్యల'పై ఆరోగ్య సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన శరీరానికి మంచి పోషకాలు అందాలంటే తొలుత మంచి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలన్నారు. దంతాలు ఆరో గ్యంగా.. బలంగా ఉంటేనే అన్ని రకాల ఆహార పదార్థాలు బాగా నమిలి మింగగలమన్నారు. తద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండొచ్చని పేర్కొన్నారు. సమపాళ్లలో అరుగుదల లేకపోతే రకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. సహజ సిద్ధంగా మనకు లభించిన దంతాలను సంరక్షించుకోవాలని, ఒకవేళ ఏ కారణంగానైనా దంత సమస్యలు తలెత్తినప్పుడు కృత్రిమ దంతాలు అమర్చుకోవడం ఎంతైనా అవసరం అన్నారు. పుట్టిన పళ్ళను తొలగించాల్సి వస్తే డాక్టర్ సలహా మేరకు డెంటల్ ఇంప్లాంటేషన్ విధానం ద్వారా చికిత్స చేయవచ్చన్నారు. పూర్వం షుగర్ వ్యాధిగ్రస్తులకు..రక్తం పలచబడే మందులు వాడే వారికి డెంటల్ ఇంప్లాంటేషన్ విధానం చేసే వారు కాదని, కానీ ప్రస్తుతం ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో వారికి డెంటల్ ఇంప్లాంటేషన్ విధానంలో చికిత్స చేసే అవకాశం నేడు ఉందన్నారు. ప్రతి రోజు రెండు పర్యాయాలు పళ్ళను శుభ్రం చేసుకోవాలని, ఆహారం తిన్న వెంటనే పుక్కిలించి ఉయాలని, దంత పరిరక్షణ నిమిత్తం ప్రతి ఆరు నెలలకొకసారి దంత వైద్యుల వద్ద వెళ్లి పళ్ళను శుభ్రం చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ సలహా లేకుండా మౌత్ బ్రష్‌లు వాడరాదని, ఇష్టానుసారం టూత్ బ్రష్ లను వాడితే మన నోటిలో ఉండవలసిన మంచి బ్యాక్టీరియా కూడా పోయి నోటిలో అల్సర్స్ రావడం.. నోరు ఎండిపోవడం లాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. అవగాహన సంస్థ సభ్యులు డాక్టర్ కొండా ప్రత్యూషను ఘనంగా సత్కరించారు. ఈ ఆరోగ్య సభకు టీవీ సాయిరాం కో-ఆర్డినేటర్ గా వ్యవహారం చగా..రాడికల్ హ్యూమనిస్ట్ కె.చంద్రశేఖరరావు, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు.

సైక్లింగ్‌తో శారీరక దృఢత్వం: ఎస్పీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : సైక్లింగ్‌తో శారీరక దృఢత్వం పెంపొందుతుందని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం 'ఫిట్ ఇండియా-సండేస్ ఆన్ సైకిల్ ర్యాలీ విత్ డిస్ట్రిక్ట్ పోలీస్ ఫోర్సెస్' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ సాన్నిధ్యంలో అదనపు ఎస్పీ(ఏఆర్) ఏ.హనుమంతు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ జిల్లా పోలీస్ కార్యా లయం నుంచి ప్రారంభమై ఎంటీబీ సెంటర్ వరకు వెళ్లి తిరిగి పోలీస్ కార్యాలయానికి చేరింది. ఎస్పీతో పాటు పెద్దఎత్తున పోలీస్ అధికారులు, సిబ్బంది సైకిళ్లపై పాల్గొని ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బందిలో శారీరక దృఢత్వం పెంపొందిం చడం, రోజువారీ విధుల్లో చురుకుదనం, మానసిక ఉల్లాసం పెంచడం, ఆరోగ్యకర జీవన విధానం ద్వారా ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిం చడం, ఆరోగ్యకర పోలీస్-భద్రత గల సమాజం అనే సందేశాన్ని ప్రజల్లో వ్యాప్తి చేయడం ర్యాలీ ముఖ్య ఉద్దేశమని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే పోలీస్ దళం ఆరోగ్యంగా, దృఢంగా ఉండటం అత్యంత అవసరమని, ఫిట్ ఇండియా కార్యక్రమం పోలీస్ సిబ్బందిలో చురుకుదనం, ఆరోగ్య స్ఫూర్తి పెంపొం దించి, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలం దించేలా చేస్తుందన్నారు. పోలీస్ సిబ్బంది క్రమం తప్పకుండా వ్యాయామం, క్రీడలు, సైక్లింగ్ వంటి ఆరోగ్యకర కార్యకలాపాలను అలవర్చుకోవాలని ఎస్పీ అన్నారు. జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది ర్యాలీలో పాల్గొని ప్రజలకు ఫిట్‌నెస్ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ ర్యాలీలో డీఎస్పీలు అరవింద్, శివాజీ రాజు, ఏడుకొండల రెడ్డి, ఎస్బి సీఐ అలహరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర-తాడేపల్లి : గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తాడే పల్లి కొత్తూరులో 7 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గణేశుని దర్శించుకుని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వినాయక విగ్రహ దాతలు కళ్లం చంద్రశేఖర్ రెడ్డి, కళ్లం రాజశేఖర్ రెడ్డి, దొంతి రెడ్డి రామకృష్ణ రెడ్డి, బందావు వీరారెడ్డి, ఉయ్యూరు రామిరెడ్డి, కళ్లం వెంకటేశ్వర్ రెడ్డి, పమిడిమల్ల వెంకట్రామిరెడ్డి, కూసం భారత్ రెడ్డి, బుర్రముక్కు విశ్వనాథరెడ్డి, బండి మల్లారెడ్డి, రెడ్డి బత్తుల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వరసిద్ధి వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం

ఉండవల్లిలో శ్రీ వరసిద్ధి వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వరసిద్ధి వినాయక సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంపై చెరగని సంతకం మహాకవి శ్రీశ్రీ కవిత్వం

75వ వార్షికోత్సవ సభలో వక్తలు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: సమానత్వపు పరిమళాలు గుబాళించేలా, మానవత్వం విరాజిల్లేలా మహాకవి శ్రీశ్రీ కవిత్వం నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. శాసనమండలి మాజీ సభ్యులు కె ఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన ఆదివారం బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శ్రీశ్రీ మహ ప్రస్థానం 75వ వార్షికోత్సవ సభ జరిగింది. ముఖ్య వక్తగా హాజరైన శివశంకర్ ప్రసంగిస్తూ సమాజంలో నెలకొన్న పేదరికం, నిరుద్యోగం, ఆకలి వంటి సమస్యలపై అత్యంత ఆవేదనకు గురైన శ్రీశ్రీ తన కవిత్వపు బావుటాను ఎగుర వేశారని అన్నారు. 'మరో ప్రపంచం పిలిచింది', 'నేను సైతం ప్రపంచానికి సమిధనొక్కటి ఆహుతినిచ్చాను' అంటూ తన రచనా సంపుటాలతో శ్రీశ్రీ గర్జించారని అన్నారు. యుగ యుగాల సాహిత్యంలో తనదైన శైలిలో అభ్యుదయ భావనలను నింపి అత్యంత సులువైన, సున్నితమైన సాహిత్యంతో నవ సమాజపు నిర్మాణం వైపు కొత్త ఆశలు చిగురింపచేశారని అన్నారు. విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నాయకులు సి.ఎస్.ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ శ్రీశ్రీ అందరి బాధను తన కవిత్వంలో పలికించి, తెలుగు సాహిత్యానికి చక్కటి వన్నె తెచ్చారని, మానవుడే తన సందేశమని గట్టిగా చాటారని అన్నారు. ఒక ప్రక్క ఆయన కవిత్వం, వ్యాసాలు సాహిత్యాన్ని రంజింపచేయగా, మరో వైపు ఆయన సినీ సాహిత్యం ముఖ్యంగా అభ్యుదయ పాటలు సాహిత్య ప్రియుల్ని, ప్రేక్ష కులను అలరించాయని అన్నారు. ఈ సందర్భంగా 'శ్రీశ్రీ సాహిత్యం-నేటి ప్రాధాన్యత' అనే అంశంపై నగరంలోని వివిధ కళాశాలల్లో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీ నారాయణ ఈ పోటీల్లోని విజేతలకు బహుమతు లను అందజేశారు. ఎమ్.వి.ఎస్ మెమోరియల్ స్కూల్ విద్యార్థులు శ్రీశ్రీ మహ ప్రస్థానంలోని పలు స్ఫూర్తిదాయక కవితలను ఈ సభలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల కమిటీ కన్వీనర్ ఎన్.భావన్నారాయణ, కాపు శ్రీనివాస్, ప్రొఫెసర్ ఎన్.వేణు గోపాలరావు, ఎమ్.హనుమంతరావు, ఎల్.ఎస్.భారవి, అవధానుల హరి, వి.వి.కే.సురేష్, ఎమ్.ఉదయ భాస్కర్, వి. సదాశివరావు, జి.వెంకట్రావు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాపుల ఏర్పాటుకు శంకుస్థాపన

విశాలాంధ్ర-దుగ్గిరాల: మండల కేంద్రమైన దుగ్గిరాలలో బాలికల ఉన్నత పాఠశాలలో తాగునీరు ఏర్పాటుకు రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం తెనాలి సభ్యులు సహకారంతో ఆదివారం శంకుస్థాపన చేశారు. క్లబ్ సభ్యులు సహకారంతో మంచినీరు తాగుటకు ట్యాపులు ఏర్పాటు చేయనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.శోబాదేవి తెలిపారు. క్లబ్ గవర్నర్ డాక్టర్ రాంప్రసాద్, అసిస్టెంట్ గవర్నర్ పూర్ణ చందు, ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేశారు. విద్యార్థులకు తాగునీరు కొరత తీరనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దోస్త్ అధ్యక్షులు ఎం.గాంధీ, ఫిజికల్ డైరెక్టర్లు భక్తులు వెంకటేశ్వరరావు, మన్నవ ఆంతోనమ్మ, గూడూరు వెంకట రావు, గద్దె వాసు, వల్లూరు నరసింహారావు, నక్కా చిరంజీవి, కన్నెగంటి మురళీకృష్ణ, రావు పాల్గొన్నారు.

సమాజ సేవ అభినందనీయం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : నిరుపేదలకు అందే చిరుసాయం వారి జీవితాలకు ఆధారంగా నిలుస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆదివారం గుంటూరు నగరం డీఎస్ నగర్‌లో ఎమ్మెల్యే నసీర్ చేతులమీదుగా వీధి వ్యాపారులకు తోపుడు బండ్లు, విద్యార్థులకు ఆర్థికసాయం అందజేశారు. మాజీ కార్పొరేటర్ మాలకొండయ్య సహకారంతో ఒక్కొక్క తోపుడు బండి రూ.10 వేలు, ఇస్త్రీ బండి రూ.15 వేలతో సమకూర్చారు. వీటిని లబ్ధిదారులకు అందించిన ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ చిరు వ్యాపారులకు తోపుడు బండ్ల ద్వారా వారి జీవనం సాఫీగా కొనసాగుతుందని తెలిపారు. పేదలకు తన వంతు సాయం అందించాలనే మంచి గుణం కలిగి ఉండటం అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో వీధి వ్యాపారుల జీవనోపాధి పెంచేందుకు ప్రత్యేకంగా రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. గుంటూరు నగరంలో వీధి వ్యాపారులను ప్రోత్సహించేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పీ4 కార్యక్రమం ద్వారా అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సాయాన్ని అందుకున్న వీధి వ్యాపారులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వేముల శ్రీను, చల్లా ఆంజనేయ ప్రసాద్, వహీద్, వాకా వీరారెడ్డి, రవి, అర్జున్, ముసలయ్య, నరేంద్ర, అచ్చి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జయసత్య జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-మంగళగిరి : యర్రబాలెంలో టీడీపీ రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య జన్మదినోత్సవ వేడుకలు ఆమె నివాసంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను జయసత్య కట్ చేశారు. పలువురు దేశం తమ్ముళ్లు ఆమెను కలిసి శాలువాలతో సత్కరించి, బొకేలు అందజేసి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ జయసత్య అమరావతి రాజధాని ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. గత సార్వత్రిక ఎన్నికలలో నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ విజయానికి అహర్నిశలు కృషి చేశారన్నారు. సంపూర్ణ ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో ఉన్నతమైన పదవులను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఫిరోజ్ ఖాన్, కర్నాటి సత్యనారాయణ, ఆకుల పానకాలరావు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి గణేష్ విగ్రహాలు

విశాలాంధ్ర-తాడికొండ: పూజలు అందుకున్న గణేష్ విగ్రహాలు నిమజ్జనానికి తరలి వెళుతున్నాయి. ఆదివారం సెలవు దినం కావడంతో అధిక సంఖ్యలో పూజలు, అన్నదానం, ఊరేగింపులు పూర్తిచేసుకుని విగ్రహాలు నిమజ్జనానికి తరలి వెళ్లాయి. గుంటూరు నగరంలోని అనేక ప్రాంతాల నుండి అమరావతి వెళుతుండగా, తాడికొండ పరిసర ప్రాంతాల నుండి తుళ్లూరు మండలం రాయపూడి గ్రామానికి విగ్రహాలు నిమజ్జనానికి వెళ్లాయి.

రూ.2,75,116లు పలికిన లడ్డు

విశాలాంధ్ర-తాడేపల్లి : వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు అయిన ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని కుంచన పల్లిలో ఫ్రెండ్లీ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో మూడు వేల మందికి భక్తులకు అన్నదానం నిర్వహిం చారు. ముందుగా భక్తులు పాల్గొని గణేశుని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన లడ్డు వేలం పాటలో లడ్డును రూ.2,75,116లకు గ్రామానికి చెందిన చుక్క మధు చేజిక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో అమరా సుబ్బారావు, కానుగోలు కోటేశ్వరరావు, మేకల రాజా, బొద్దు మహేంద్ర, కొప్పురి సురేష్, గద్దం మురళీకృష్ణ, తోటకూర ప్రవీణ్, నిర్వాహకులు ముత్యాల శ్రీనివాసరావు, పూల పవన్ కుమార్, వడ్లమాను రాంబాబు, జవ్వాజి సత్యనారాయణ, ఎనుముల అర్జునరావు, చుక్క మధు సాంబశివరావు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వినాయకునికి జవ్వాది కిరణ్ చంద్ పూజలు



విశాలాంధ్ర-మంగళగిరి : మండల పరిధిలోని పెదవడ్లపూడి కొత్తపాలెం గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలు విశేషంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీ వినాయక ఆర్ట్స్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ ప్రత్యేక అతిథిగా హాజరై వినాయకుని వద్ద పూజలు చేసి తీర్థప్రసాదములు స్వీకరించారు. అనంతరం గ్రామంలోని శ్రీ విఘ్నేశ్వర ఆర్ట్స్ కమిటీ వారు ఏర్పాటు చేసిన గణపతి మండపానికి వెళ్లి భక్తుల మధ్య స్వామివారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవ్వాది కిరణ్ చంద్ మాట్లాడుతూ వినాయక చవితి పండుగ ఐకమత్యం, సాంప్రదాయం, భక్తిభావాల పండుగ అని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలు గ్రామాల్లో సోదరభావాన్ని పెంపొందిస్తాయని, యువత సాంస్కృతిక సంప్రదాయాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామస్తులు, యువతీయువకులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు యెళ్ళ శివరామయ్య, మాదల రమేష్ బాబు, యోమినేని సుధాకర్, మొద్దుకూరి రమేష్, కంచర్ల బద్రి, బొర్రా శ్రీకాంత్, కొప్పాక ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి లక్ష్మీనరసింహస్వామి పవిత్రోత్సవాలు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సెప్టెంబర్ 2 నుంచి 5 వరకు వార్షిక పవిత్రోత్సవాలు జరుగనున్నాయని దేవస్థాన సహాయ కమిషనర్, ఈవో కోగంటి సునీల్ కుమార్ తెలిపారు. నాలుగు రోజులపాటు జరిగే విశేష పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారి దర్శనం, తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

విశాలాంధ్ర-దాచేపల్లి : విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని మాచర్ల ఈఈ సింగయ్య వినియోగదారులను కోరారు. ఆదివారం నారాయణపురంలోని కార్యాలయంలో సిబ్బందితో విద్యుత్ బిల్లుల వసూళ్ళపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ వినియోగదారులు తమ ఇళ్ళు, దుకాణాలకు చెందిన కరెంటు బిల్లులను ప్రతి నెలా బకాయి లేకుండా చెల్లించాలని కోరారు. అదేవిధంగా అధికారులు, ఉద్యోగులు కూడా నెల వారీ వసూళ్ళతో పాటు పేరుకుపోయిన బకాయిలపై కూడా దృష్టి సారించాలన్నారు. నూరు శాతం వసూళ్ళకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఏఓ సందీప్ కుమార్, జేఏఓ ఆశీర్వాదం, డీఈఈ వీరేశ్వరరావు, ఏఈలు భగవాన్, దండా నాగేశ్వరరావు, సబ్ ఇంజినీర్ వసంతలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు ఉట్ల సాంబయ్య మృతి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: నిబద్ధత గల సీపీఐ సీనియర్ నాయకుడు ఉట్ల సాంబయ్య(72) మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు అన్నారు. మండలంలోని వేలూరు గ్రామంలో ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న బాబూరావు పార్టీ నాయకులతో కలసి భౌతికకాయంపై ఎర్ర జెండా కప్పి, నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి బొంతా ధనరాజ్,వేలూరు గ్రామ కార్యదర్శి ఏలికా శ్రీనివాసరావు, ఉట్ల వెంకటేశ్వర్లు,సయ్యద్ నానా,గ్రామ సీపీఐ నాయకులు తదితరులు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

ఎంఎస్ పేట పాఠశాలలో ఉద్యోగ విరమణ సభ

విశాలాంధ్ర-దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని ఎంఎస్ పేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పప్పుల పెరల్సన్ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ఆయనకు ఉపాధ్యాయ బృందం ఆత్మీయ సత్కారం చేశారు. అనంతరం ఆయన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పినాకపాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనసేనలోనే కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: పార్టీ కోసం నిస్వార్థంగా కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు.. భవిష్యత్తు తరాలకు బలమైన నాయకత్వం అందించే వ్యూహం.. నిరంతరం పార్టీ కోసం పని చేసే వారికి భద్రత జనసేన పార్టీ ద్వారానే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి అన్నారు. కార్యకర్తలతో 'సేనతో సేనాని' పేరిట జనసేన పార్టీ ఏర్పాటు చేసిన విస్తృతస్థాయి సమావేశానికి హాజరైన బాలాజి ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ సగటు మనిషి కోపం, ఆవేశం, ఆక్రోశాల నుంచి ఉద్భవించిన జనసేన పార్టీ రానున్న రోజుల్లో జాతీయ పార్టీగా ఎదగనున్నదని చెప్పారు. రాజకీయాల్లో సిద్ధాంత బలంతోపాటు వాటిని సంపూర్ణంగా నమ్మి అమలు చేసే శక్తి ఉండాలని, అటువంటి శక్తి జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌కు ఉంది కాబట్టే ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకోగలిగారని బాలాజి వెల్లడించారు. జనసేన భావజాలంతో కార్యకర్తలు బలపడి, భావి భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు.

వైభవంగా గణేష్ నిమజ్జనాలు

విశాలాంధ్ర-గురజాల : గణేష్ చతుర్థి ఉత్సవాల్లో భాగంగా నిమజ్జోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా 5వ రోజు గురజాలలో నిమజ్జ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక రెడ్డి బండ సెంటర్‌లో కాకతీయ గణేష్ ఉత్సవ కమిటీ(ఆర్ఆర్‌సీ) యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుడు నిమజ్జనానికి బయలుదేరాడు. ఈ సందర్భంగా నిర్వహించిన 51 కిలోల లడ్డు వేలంపాటలో పోటు శ్రీకాంత్ రూ.1.81 లక్షలకు దక్కించుకున్నాడు. స్థానిక గుంటూరు రోడ్‌లో లోటస్ టవర్స్‌లో మట్టి గణనాథుడు నిమజ్జనం జరిగింది. ఇక్కడ జరిగిన లడ్డు ప్రసాదాన్ని రవితేజ సెల్యులార్ అధినేత గుండా రవితేజ రూ.31 వేలకు దక్కించుకున్నాడు. ఆయా కార్యక్రమాలలో, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, యువకులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలి

గుర్రం జాషువా జిల్లా సాధన కమిటీ డిమాండ్

విశాలాంధ్ర-నరసరావుపేట : పల్నాడు జిల్లాకు ప్రసిద్ధ తెలుగు కవి, సామాజిక సంస్కర్త గుర్రం జాషువా పేరు పెట్టాలని కోరుతూ ఆదివారం పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో పల్నాడు గుర్రం జాషువా జిల్లా సాధన సమితి, పల్నాడు జిల్లా బలహీన వర్గాల ఐక్యవేదిక, బీసీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్‌లు ఈ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ గుర్రం జాషువా సాధారణ కవి కాదు, ఒక గొప్ప సామాజిక సంస్కర్త. ఆయన రచనలు జాతి వివక్ష, అసమానతలు, దళితుల బాధలను శక్తివంతంగా చిత్రీకరించి, సమాజంలో మార్పు తీసుకురావడానికి ప్రేరణనిచ్చాయన్నారు. ఉదాహరణకు, 'గబ్బిలం' మహాకావ్యం ఆలయాల్లో జాతి భేదాలని అద్భుతంగా వివరిస్తూ, కాళిదాసు 'మేఘదూతం' స్థాయి దళిత ఉత్తమత్వాన్ని చూపిస్తుంది. 'కృష్ణ చరిత్ర' వంటి రచనలు సాహిత్య అకాడమీ అవార్డు పొంది, బలహీన వర్గాల జీవితాలను కవిత్వంగా మార్చాయి. ప్రతిఒక్కరూ గుర్రం జాషువా గురించి తెలుసుకోవాలి. అటు వంటి మహాకవి పల్నాడు జిల్లాలోని వినుకొండ నియోజకవర్గానికి చెందినవాడు, ఈ ప్రాంత ప్రజలకు గర్వకారణం. తప్పనిసరిగా పల్నాడు జిల్లాకు 'గుర్రం జాషువా జిల్లా'గా నామకరణం చేయడం చాలా అవసరమని అన్నారు. ప్రస్తుత సమాజంలో కులం, మతం, ధనం వెంట పరుగులు పెడుతున్న మనుషుల గురించి కూడా విమర్శించారు. అభ్యుదయ భావాలు కలిగి, కులం-మతాలకు తీతంగా బదుగు, బలహీన వర్గాల అందరూ సామాజిక చైతన్యం పొందాలి. సైన్స్ అండ్ టెక్నాలజీ పెరిగిన నేటి కాలంలో కూడా కులం-మతం వెంట పరిగెరటం మంచిది కాదని సూచించారు. సమావేశంలో పాల్గొన్న మాజీ నాయకులు కూడా గుర్రం జాషువా సాహిత్యం సామాజిక సామరస్యానికి, దళితత ఉద్యమానికి చేసిన సేవలను ప్రశంసిస్తూ, జిల్లా పేరు మార్పుకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గుర్రం జాషువా ఆదర్శాలను ప్రచారం చేసి, జిల్లా నామకరణానికి ప్రభుత్వాన్ని ఆకర్షించాలని సమితి నాయకులు పిలుపునిచ్చారు.

సెప్టెంబర్1 మరో చరిత్రాత్మక రోజుగా నిలుస్తుంది: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : సెప్టెంబర్ 1వ తేదీ టీడీపీకి, గురజాల నియోజకవర్గానికి ఎంతో శుభసూచకమైన రోజని, అదే రోజున స్త్రీ శక్తి విజయోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని జానపాడు రోడ్డులో 20 వేల మందికి పైగా మహిళలతో స్త్రీ శక్తిని చాటేలా భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2013 సెప్టెంబర్ 1వ తేదీన రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆత్మగౌరవ యాత్రను నిర్వహించేందుకు ఎవరు ముందుకు రాని సమయంలో గురజాల నియోజక వర్గ కార్యకర్తలు, ప్రజల ఆశీస్సులతో పొందుగల నుంచి ఆత్మగౌరయాత్ర ప్రారంభమవడం సాహసోపేత సంఘటనగా నేటికీ సీఎం చంద్రబాబు పలు సందర్భాల్లో ప్రస్తావించటం గర్వకారణమన్నారు. 1వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే స్త్రీ శక్తి విజయోత్సవ సభ చారిత్రాత్మక సభగా నిలిచేలా మహిళలు తరలివచ్చి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. సభకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీలు బైరెడ్డి శబరి(నంద్యాల) లావు శ్రీకృష్ణదేవరాయలు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి పలువురు ప్రముఖులు హాజరవుతారన్నారు. ప్రతి కార్యకర్త, నాయకుడు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, యువనేత యరపతినేని నిఖిల్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కవి కమలా రామ్‌కు 'తెలుగు తేజం అవార్డు'

విశాలాంధ్ర - వినుకొండ : అంతర్జాతీయ సంస్థ శ్రీ శ్రీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకమైన 'తెలుగు తేజం' పురస్కారం వినుకొండ జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు, జాషువా సమాఖ్య గౌరవ అధ్యక్షులు, రచయిత జీ కమలారామ్‌కు అందజేసినట్లు ప్రతాప్ తెలిపారు. ఆదివారం నరసరావుపేటలో నిర్వహించిన తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి ఉత్సవాల సందర్భంగా తెలుగు భాష సంబరాలు కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. ఎన్నో ఏళ్లుగా సాహితీ రంగంలో మరియు కళా రంగంలో సేవలు చేస్తున్న రచయితలకు ఈ అవార్డును ప్రకటించినట్లు శ్రీశ్రీ కళా వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి టి పార్థసారథి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు శాంతి బాయితో పాటు తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాల వద్ద జీవీ పూజలు

విశాలాంధ్ర - వినుకొండ : వినాయక నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆదివారం పట్టణంలోని పలు వినాయక మండపాలను సందర్శించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవి మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారి ప్రార్థించారు. అనంతరం విగ్రహ కమిటీ వారు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కవి మాన్ సింగ్ నాయక్ పురస్కారం

విశాలాంధ్ర-కారంపూడి : స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్) ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ప్రముఖ బాలసాహితీవేత్త, కవి, రచయిత బి మాన్ సింగ్ నాయక్ ప్రతిష్టాత్మకమైన తెలుగు తేజం పురస్కారం అందుకున్నారు. నరసరావుపేట పట్టణంలోని భువన చంద్ర టౌన్‌హాల్‌లో ఆదివారం జరిగిన తెలుగు భాషా దినోత్సవ సభలో అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌కుమార్, శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా మాన్ సింగ్ నాయక్ సాహిత్య ప్రస్థానాన్ని ప్రశంసిస్తూ వారు మాట్లాడుతూ భాషాభిమానంతో, సాహిత్యసేవతో తెలుగు సాంస్కృతిక స్ఫూర్తిని నేటి తరాలకు చేరవేస్తున్న మాన్ సింగ్ నాయక్ కృషి ప్రశంసనీయం అని పేర్కొన్నారు. పురస్కారం అందుకున్న మాన్ సింగ్ నాయక్‌ను పాఠశాల సిబ్బంది, మండల విద్యాశాఖాధికారులు, సంఘ సభ్యులు, భాషాభిమానులు అభినందించారు.

అజాతశత్రువు సాంబశివరావు

విశాలాంధ్ర-అమరావతి : అజాతశత్రువు సాంబశివరావు అని మునుగోడు ప్రాథమిక వ్యవసాయ సహకారం పరపతి సంఘం లిమిటెడ్ చైర్‌పర్సన్ నాగోతు నాగార్జున అన్నారు. మండల పరిధిలోని మునుగోడు కోపరేటివ్ సొసైటీ సీఓ ఉద్యోగ విరమణ ఆదివారం సొసైటీ ఆవరణలో నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షునిగా చిరు మామిళ్ల చెవిరీలు వ్యవహరించగా నాగార్జున ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సాంబశివ రావు అజాతశత్రువుగా మునుగోడు సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించి అధికారులు, ప్రజలు, రైతులు అందరికీ తలలో నాలుకల ఉంటూ సొసైటీకి సేవలు అందించడం అభినందనీయమన్నారు. సాంబశివరావు చంద్రకళ శేష జీవితాన్ని సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. జీడీసీ బ్యాంకు విశ్రాంతి మేనేజర్ పి.శివన్నారాయణ మాట్లాడుతూ సాంబశివరావు చిన్ననాటి నుంచి కష్టపడి పైకి వచ్చిన వ్యక్తి అని, ఆయన సేవలు మరువలేమని కొనియాడారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు. సాంబశివరావు చంద్రకళ దంపతులను మెమెంటోలు, దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కన్నధార వసంతరావు, సీపీఐ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు, సింగం భాస్కర్ రెడ్డి, ఎస్‌కే షరీఫ్, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, సొసైటీ సిబ్బంది రాజేశ్వరి, బాజీ, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డులను మరమ్మతులు చేయండి : సీపీఐ

రాష్ట్ర సమితి సభ్యులు జూనెబోయిన శ్రీనివాసరావు

విశాలాంధ్ర-జగ్గయ్యపేట :మండలం పరిధిలో నేషనల్ హైవే 65 వెంబడి పాడైన సర్వీస్ రోడ్డులను వెంటనే మరమ్మతులు చేయాలని సీపీఐ పార్టీ పట్టణ కార్యదర్శి, రాష్ట్ర సమితి సభ్యులు జూనెబోయిన శ్రీనివాసరావు అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవే వారు వాహనాల వద్ద మెయింటెనెన్స్ కోసం వాహనదారుల వద్ద నుండి టోల్ రుసుము వసూలు చేయడానికి ఉన్న శ్రద్ధ సర్వీస్ రోడ్లను మరమ్మతులు చేయడంలో లేదని ఆయన ఆరోపించారు.మండలంలో భక్తుల సౌకర్యార్థం తిరుమలగిరి సర్వీస్ రోడ్డు,సత్యనారాయణపురం నుండి షేర్ మహమ్మద్ పేట రైతుల కోసం ఏర్పాటు చేసిన సర్వీస్ రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, దీని వల్ల వాహనదారులు అవస్థలు పడుతున్నారని, వెంటనే మరమ్మతులు చేయకపోతే ప్రజా పక్షాన ఆందోళన చేస్తామనిహెచ్చరించారు.

యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య

విశాలాంధ్ర-వీరులపాడు: క్రీడలు మానసికోల్లాసంతో పాటుగా, జాతీయ సమైక్యతను చాటి చెబుతాయని నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా నైపుణ్యం పెంపొందించుకొని జాతీయ అంతర్జాతీయ స్థాయిలకు ఎదగాలని ఆమె అన్నారు. కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో ఆదివారం జమ్మవరం, బోడవాడ గ్రామాల జట్లు మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. విజేతలకు శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య, కేశినేని ఫౌండేషన్ డైరెక్టర్ కేశినేని వెంకట్ చేతుల మీదగా ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించిన జట్లకు జ్ఞాపికలతో పాటు నగదు బహుమతులను అందజేశారు. తదనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో శాసన సభ్యురాలు, ఫౌండేషన్ డైరెక్టర్ వెంకట్‌లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాముఖ్యతనిస్తుందని దీనిలో భాగంగానే విజయవాడ ప్రీమియర్ లీగ్‌ను త్వరలోనే జిల్లా స్థాయిలో ప్రారంభించబోతున్నామని, తద్వారా గ్రామీణ యువతలో నైపుణ్యాన్ని వెలికి తీసి ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌కు అదే విధంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్‌కు సభ్యులను ఎంపిక చేసుకునే విధంగా టోర్నమెంట్లు నిర్వహిస్తామని తెలిపారు.టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి ఒక్క జట్టుకు కేశినేని ఫౌండేషన్ తరపున సంస్థ డైరెక్టర్ వెంకట్ చేతుల మీదుగా క్రికెట్ కిట్లు అందజేశారు.

ఎస్సీ సెల్ కార్యదర్శిగా వేల్పుల రమేష్

విశాలాంధ్ర-కంచికచర్ల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా వేల్పుల రమేష్‌ను నందిగామ నియోజక వర్గం లోని రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి, మాజీ అగ్రికల్చర్ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, ఉమ్మడి కృష్ణాజిల్లా మాజీ సొసైటీ డైరెక్టర్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొమ్మినేని రవి శంకర్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొండ కృష్ణారెడ్డి,కంచికచర్ల మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ బీసీ సెల్ నాయకులు మర్రి వరప్రసాద్, మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ కందుల అశోక్ సీనియర్ నాయకులు గోపిదేశి పున్నయ్య, సొంగ రాజేష్, పాపినేని చిన్నబ్బాయి, పెండ్యాల గ్రామ ప్రధాన కార్యదర్శి గాలిదెన్నె నరసింహా రావు, జనిగొర్ల కృష్ణ, మీసాల శ్రీనివాస్, కనుమూరు ఆంజనేయులు, షేక్ నిసార్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాల్లో అన్న సమారాధన

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా విస్సన్నపేట మండలంలో ఆదివారం పెద్దఎత్తున అన్నసమారాధన కార్యక్రమాలు జరిగాయి. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం, టీచర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద, చంద్రుపట్ల తండా పంచాయతీ పరిధిలోని కొర్ర తండా గ్రామంలో ఏర్పాటు చేసిన నవరాత్రి ఉత్స వంలో ఈ కార్యక్రమాలను గ్రామ స్తులు చేపట్టారు. తిరువూరు శాసన సభ్యుడు కొలికపూడి శ్రీనివాస రావు విస్సన్నపేట, కొర్ర తండా గ్రామాల్లోని అన్న సమారాధన ప్రారంభించి, భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో తిరువూరు ఏఎంసీ ఉపాధ్యక్షుడు కెవి.నాగేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు అనుమోలు శివాజీ, మండల టీడీపీ అధ్యక్షుడు రాయల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని నిమజ్జనాలు

విశాలాంధ్ర-పెదపారుపూడి:మండలంలోని చినపారుపూడి, భూషణగుళ్ళ గ్రామాలలో గత 5 రోజులుగా వినాయకునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ వీధులలో ఊరేగిస్తూ ఆదివారం నిమజ్జనాలుచేశారు.కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, బీసీ విభాగం నియోజకవర్గ నాయకుడు దానబోయిన వెంకటనారాయణ, కొల్లి రమణబాబు, గోగం రామారావు, సంపంగి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గూడవల్లి కృష్ణార్జునరావు

విశాలాంధ్ర- పెడన: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా గూడవల్లి కృష్ణార్జునరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు అమరావతి బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, అధ్యక్షుడు వెంగళరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షు రాలు నూకాలమ్మ చేతులమీదుగా కృష్ణార్జునరావు నియామకపత్రాన్ని అందుకున్నారు.

హెచ్‌బీ కాలనీలో వినాయక చవితి వేడుకలు

విశాలాంధ్ర -విజయవాడ (వన్‌టౌన్): భవానిపురం ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీ రామాలయం వీధిలోని బాల గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలుగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. చిన్నపిల్లలలో దైవభక్తిని ప్రోత్సహించే కార్యక్రమాలు చేపడుతూ వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించుటకు అవకాశము కల్పిస్తున్నారు ఈ సంవత్సరము గత ఐదు రోజులుగా పూజలు అందుకున్న బాలగణ బాల గణపతిని ఈరోజు నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులందరికీ అన్న ప్రసాదాలను అందించారు. గత ఐదు రోజులుగా పూజలు అందుకున్న రెండు లడ్డులను వేలం నిర్వహించగా ఒక లడ్డు రూ.6850, రెండవ లడ్డు రూ. 12వేలకు భక్తులు తమ సొంతం చేసుకున్నారు. గణపతి ఉత్సవాలను అద్భుతంగా నిర్వహించిన బాల గణపతి సేవా సమితి సభ్యులను కాలనీవాసులు ప్రశంసించారు. బాల సేవా గణపతి సభ్యులైన పెద్దినేని సాయి కృష్ణ, మదన నందివాడ, కిషోర్ ఖాయం దాసు కాలనీ వాసులు అందించిన సహాయ సహకారాలకు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

అర్హులకు పెన్షన్

విశాలాంధ్ర-కూచిపూడి.: ఎన్టీఆర్ భరోసాపెంక్షన్లో మంచానికే పరిమితమైన రోగులు, వివిధ రకాల దివ్యాంగులులో మొవ్వ మండలంలో 407 మందికి ఆగస్టు 13,14 తారీకులలోఆయాగ్రామాల్లోని సచివాలయాల సిబ్బంది సంబంధిత పింఛనులకు అనర్హులంటూ ప్రభుత్వం విడుదల చేసిన నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న లబ్ధిదారులలో 388మంది లబ్ధిదారులుఅప్పిలు ఆగస్టు 19,20 తారీకులలో (దరఖాస్తు) చేసుకోవడంతో వారందరికీ సెప్టెంబర్ 1వ తారీఖున పెన్షన్ పేమెంట్ అందజేస్తున్నట్లు ఎంపీడీవో (పూర్తి అదనపు బాధ్యతలు) నూతుల పాటిశ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ విధంగా అప్పీలు చేసుకున్న వారిలో పెదపూడిలో ఇద్దరు చనిపోవడంతో 386 పెన్షన్లు డిఆర్డిఏ విడుదల చేసినట్లు. ఈవిధంగాఅప్పిలు (దరఖాస్తు) చేసుకో(లే)ని 19 మందికి నిలిపివేశారని వివరించారు.

మండలంలోని 16 సచివాలయాలలో దరఖాస్తులు దాఖలు చేసుకున్న లబ్ధిదారుల పెన్షన్ వివరాలు ఇవే.. అవురుపూడిలో 33, అయ్యంకిలో 33, భట్ల పెనుమర్రులో 17, చినముత్తేవిలో 7, కాజ-1 లో 19, కాజ-2 లో 26, కోసూరులో 34, కూచిపూడి లో 39, మొవ్వ-1 లో 28, మొవ్వ-2 లో 21, మంత్రి పాలెం లో 32, నిడుమోలులో 25, పెదముత్తేవిలో 8, పెదపూడి లో 36, పెదసనగల్లులో 18, వేముల మడలో 10మంది లబ్ధిదారులు అప్పిలు చేసుకోవడంతో వారందరికీ ఈనెల పెన్షన్ విడుదలైంది. కాగా వచ్చేనెల వీరందరికీ పెన్షన్ పంపిణీ ప్రభుత్వం తీసుకునే నిర్ణయం పై ఆధారపడి ఉంటుందని తెలుస్తోంది.

గోవులకు గోప్రేమికులు దాతృత్వాన్ని చాటుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో- మచిలీపట్నం : గత 15 రోజులుగా మచిలీపట్నం మార్కెట్ యార్డ్‌లో ఉన్న బృందావనపుర గో సంరక్షణ కేంద్రంలోని గోవులకు గోప్రేమికులు ప్రతిరోజు వారికి ఇష్టం వచ్చిన విధంగా వచ్చి అరటిపండ్లు, వివిధ రకాల పండ్లు, వరిగడ్డి ఇస్తున్నారు. అలాగే గోవులకు ప్రతినిత్యం వచ్చి గోపూజ చేసుకునేవారు కొంతమంది ఇలా రకరకాలుగా గోప్రేమికులు గోవులపై వారి ప్రేమను చూపించుకుంటున్నారు. అందులో భాగంగా ఆదివారం చలమలశెట్టి రాంబాబు గోవులకు రెండు గెలల అరటిపండ్లు తీసుకొచ్చి వారిచేత్తో స్వయంగా గోవులకు తినిపించారు. ఇలా ప్రతి రోజు మార్కెట్ యార్డ్‌లోని గోవులకు గోప్రేమికులు వారి దాతృత్వాన్ని చాటుకోవాలని గోప్రేమికులు గొర్రెపాటి గోపీచంద్ దాతలను కోరారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

విశాలాంధ్ర-పమిడిముక్కల:అన్ని వృత్తులలో ఉపాధ్యాయ వృత్తి పవిత్ర మైనదని ఉన్నత మైనదని పమిడి ముక్కల పాఠశాల ప్రధానోపాధ్యాయులు యల మంచిలి దుర్గాభవాని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల లో పనిచేస్తున్న డి.వి.కుమార్ పదవీవిరమణ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణిత ఉపాధ్యాయునిగా డి.వి. కుమార్, సామాజిక సేవకునిగాపనిచేశారని ప్రశంసించారు. అనంతరం కుమార్ ని పాఠశాల తరుపున ఘనంగా సన్మానిం చారు. ఉపాధ్యాయ బృందం, విద్యా ర్థులు, డి.ఎస్.దీక్షిత్ డి.ఎస్.రంగా చార్యులు ఎస్.శంభు ప్రసాద్ ఎ.వి.సజీవ్ రావ్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు జలమయమవుతున్న

"నాట్య క్షేత్రం" రహదారులు

విశాలాంధ్ర-కూచిపూడి: అల్ప పీడనం పడిన ప్రభావం వల్ల గత మంగళ వారం రాత్రి నుంచి కురిసిన 44.4 మిల్లీమీటర్లు (నాలుగున్నరకు పైగా సెంటీమీటర్లు) వర్షానికి కూచిపూడి-పెదపూడి సెంటర్ పూర్తిగా జలమయమై తటాకాన్ని తలపిస్తుంది. మరల ఆదివారం మబ్బులు పట్టి వర్షపు చిరు జల్లులుపడటంతో ప్రజలు భయపడాల్సిన పరిస్థితి సంభవించింది. వారసత్వ సంపద గ్రామంగా ప్రభుత్వం అభివృద్ధి చేపట్టడానికి రూపొంది స్తున్న ప్రణాళికలు ఎప్పటికీ అమలు జరుగుతాయోనని అభిప్రాయాలు కూచిపూడి, పరిసరవాసులు ప్రస్తావిస్తున్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నాట్య క్షేత్రమైన కూచిపూడి లో ఈ పరిస్థితిఎన్నిప్రభుత్వాలు ఎన్నిమారినా ఎంతమంది నాయకులు వచ్చినా పట్టించు(లే)కపోవడంతో ఎప్పటికప్పుడు వర్షాల సమయంలోపునరావృతమై ఎక్కడ వేసిన గొంగళి అక్కడ తయా రైంది. మొవ్వ మండలంలోవ్యాపార కేంద్రమైన కూచిపూడికి మండలం లోని పలు గ్రామాల నుంచి తమ అవసరాల కోసం వచ్చే ప్రజలనుంచి కూచిపూడి పెదపూడి సెంటర్ దౌర్భాగ్యాన్ని తొలగించే నాథుడే లేడా? అనే విమర్శలు వినవస్తున్నాయి. కూచిపూడి-పెదపూడి గ్రామాలలో 2009-2013 సంవత్సరాల కాలంలో అప్పటి శాసనసభ్యులు డివై దాస్ ఆధ్వర్య ంలో ఒక కోటి 85 లక్షలు వినియోగించి నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థ అప్పట్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వర్షం నీరంతా రోడ్ల మీద నిలిచిపోతోంది. డ్రైనేజీ వ్యవస్థ సరి లేనందున ఈ మురుగునీరు ఎటూ వెళ్ల(లే)కపోవడంతో సముద్రంగా మారుతున్నాయి. ఈ మురుగునీరు ఇలాగే నిలవ ఉంటే ప్రజలు అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉంది, కావున దీనికి సంబం ధిత అధికారులు వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనాలు

విశాలాంధ్ర-కూచిపూడి : ఆగస్టునెల27వతారీకునుంచి ప్రారంభమైన వినాయక చవితి వేడుకలు ఐదవ రోజైన ఆదివారం పలు గ్రామాలలో నిమ మజ్జనాలు నిర్వహించారు. కూచిపూడి అగ్రహారంలోశ్రీరుక్మిణి సత్యభామ సమేత రాజ గోపాల స్వామి మందిరం వద్ద అగ్రహారేకులు ఏర్పాటు చేసిన మూడు అడుగుల మట్టి విగ్రహం ఊరేగింపు సాంప్రదాయ పద్ధతిలో మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించారు. ఏ విధమైన హంగు ఆర్భాటం లేకుండా నిరాడంబరంగా ఊరేగి ంచి పంట కాలంలో నిమజ్జనం చేశారు. అలాగే కూచిపూడి సెంటర్లో మిల్లు బజారులో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని సైతం మహిళలు పురుషులు అధిక సంఖ్యలో పాల్గొని ఊరేగింపు నిర్వహించి యద్దనపూడి నిమజ్జనం చేశారు.

గ్రామ పంచాయతీ కార్యాలయము- తుర్లపాడు

బహిరంగ వేలం ప్రకటన

ఆర్.ఓ.సి.నెం : 08/2025- పి.ఎస్. తేదీ : 30-08-2025

ఎన్.టి.ఆర్. జిల్లా, చందర్లపాడు మండలం, తుర్లపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ది. **04-09-2025వ తేదీన గురువారం ఉదయం 11.00** గంటల నుండి తుర్లపాడు గ్రామ సచివాలయంలో నల్ల చెరువు నందు చేపలు పట్టుకొనుటకు బహిరంగ వేలం పాట ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి, చందర్లపాడు వారిచే నిర్వహించబడును. వేలంపాటలో పాల్గొను వారు ది. **04-09-2025వ తేదీన గురువారం ఉదయం 9.00 గంటల నుండి 11.00 గంటలలోపు** వేలంపాట షరతులకు లోబడి **రూ.10,000/- (అక్షరాల పదివేల రూపాయలు)** డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనవచ్చును. డిపాజిట్ చెల్లించని వారు పాట పాడుటకు అర్హత లేదు. ఇతర విషయములను కార్యాలయ పనివేళల యందు తెలుసుకొనగలరు.

సదరు వేలం పాట ఏదైనా కారణముల చేత పూర్తికాని ఎడల మరుసటి రోజున కానీ, లేక నిర్ణయించబడిన తదుపరి తేదీలలో కానీ నిర్వహించబడును. అటువంటి సందర్భాలలో తదుపరి నిర్వహించు వేలంపాట తేదీని తుర్లపాడు సచివాలయం నోటీస్‌బోర్డు నందు మరియు టామ్ టామ్ ద్వారా సమాచారం తెలియపరచగలవారము.

గమనిక : వేలం పాటను కారణములతో గాని ఎట్టి కారణము తెలుపకుండా గానీ, వాయిదా వేయు అధికారి నిర్వహణ అధికారికి కలదు.

ఎం. మాణిక్యమ్మ, పంచాయతీ కార్యదర్శి
తుర్లపాడు గ్రామ పంచాయతీ
చందర్లపాడు మండలం, ఎన్.టి.ఆర్. జిల్లా

మహనీయుల పేర్లు జిల్లాలకు పెట్టాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : సమాజ సేవకు తమ జీవితాలను అంకితం చేసిన మహనీ యుల పేర్లు జిల్లాలకు పెట్టాలి అని సోషల్ జస్టిస్ ఫోరం కన్వీనర్ రావి శ్రీనివాస్ కూటమి ప్రభుత్వా నికి విజ్ఞప్తి చేశారు.ఆదివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోషల్ జస్టిస్ ఫోరం కాపు ఐక్యవేదిక బీసీ ఐక్యవేదికల సంయుక్త ఆధ్వర్యంలో ఒక సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం తమ జీవితాలు సమాజ సేవకు అంకితం చేసిన మహనీయుల పేర్లను జిల్లాలకు పెట్టాలని దాని వలన భవిష్యత్తులో కుడా మరికొంతమంది సేవ చేయటానికి ముందుకు రావటానికి అవకాశం కలుగుతుందన్నారు. శ్రీకాకుళంకు సర్దార్ గౌతు లచ్చన్న శ్రీకాకుళం జిల్లా , కృష్ణకు వంగవీటి మోహన్ రంగా కృష్ణాజిల్లా, గుంటూరు జిల్లాకు గుర్రం జాషువా గుంటూరు జిల్లా, పల్నాడుకు కన్నెగంటి హనుమంతు పల్నాడు జిల్లా, కర్నూ లుకు దామోదరం సంజీవయ్య కర్నూలు జిల్లా, అనంతపురంకు శ్రీకృష్ణదేవరాయ అనంతపురం జిల్లాలుగా పెట్టాలని కోరారు. ప్రముఖుల పేర్లను జిల్లాలకు పెట్టడం ద్వారా సామాజికవర్గాల యొక్క ఆత్మ గౌరవాన్ని ఆత్మాభిమానాన్ని ఇనుమడింపజేసేవిధంగా ఉంటుందని సూచించారు. ఈ విషయము పై సానుకూల దృక్పథంతో ఆమోదించాల్సిందిగా కోరుతున్నామన్నారు. ప్రతిపాదించిన పేర్లను జిల్లాలకు పెట్టకపోతే ప్రజా పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జంగాల సింగరయ్య యాదవ్.సోషల్ జస్టిస్ ఫోరం రాష్ట్ర వర్కింగ్ చైర్మన్,మాసాబత్తుల శ్రీనివాస్.రాష్ట్ర వర్కింగ్ చైర్మన్,దానగౌడ్.కో చైర్మన్, కన్వీనర్లు.బొడపాటి పెదబాబు, కాకిలేటి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజం కోసం సాహిత్య ప్రక్రియ ఉపయోగపడాలి

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : సాహితీ మిత్రులు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి డా. శోభా స్మారక కవితల పోటీలో విద్యార్థులకు ఆదివారం బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం మహతీ కళావేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మచిలీపట్నం సాహితీ మిత్రులు లంకిశెట్టి బాలాజీ అధ్యక్షత వహించారు. సంస్థ కార్యదర్శి మేడిశెట్టి యోగేశ్వరరావు స్వాగతం పలికారు. సంస్థ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ సాహితీ మిత్రులు పూర్వ కార్యదర్శి వారణాసి సూర్యకుమారి కుమార్తె దివంగత డా. శోభ స్మారక కవితల పోటీ నిర్వహణలో విజేతలుగా కాకినాడకు

చెందిన డి. నాగజ్యోతి శేఖర్, గుంటూరుకు చెందిన సూర్య దేవర రవికుమార్, హైదరాబాద్‌కు చెందిన ఎం. లహరి, అనకాపల్లికి చెందిన కోరాడ అప్పలరాజు, నెల్లూరుకు చెందిన గండికోట సుధీర్ కుమార్ విజేతలుగా నిలిచారని తెలియజేశారు. వారికి నగదు బహుమతులను అంద జేశారు. 80 సంవత్సరాల వయ స్సులో సాహిత్యం మీద అభిమానం తో వారణాసి సూర్యకుమారి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆదర్శప్రాయమని బాలాజీ అన్నారు. సాహితీ మిత్రులు వ్యవస్థాపల అధ్యక్షులు ఆంధ్ర జాతీయ కళాశాల బీఈడీ కళాశాల మాజీ ప్రిన్సిపల్ రావి రంగారావు ప్రసంగించారు. మంచిని వెలుగు తీయడానికి సాహిత్య ప్రక్రియ ఉపయోగించుకో వాలని, అవినీతిని లంచగొండులను సమాజ వ్యతిరేక శక్తులను వెగు ట్టుతూ సాహిత్య ప్రక్రియ ఉండాలని అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ భగవత్ కుమార్ మాట్లాడుతూ కవులను, కళాకారులను ప్రోత్సహించడం, స్వాగతించదగిన విషయమన్నారు. సాహిత్య ప్రక్రియ ద్వారా తెలుగు భాష ఔన్నత్యాన్ని మరింత పెంచడా నికి పనికొస్తుందన్నారు. డా. వార ణాసి శైలజ, భవిష్య, తెలుగు భాష సమైక్య సంస్థ కార్యదర్శి అప్పినీడి పోతురాజు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ సిలార్, అన్నపూర్ణ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు కర్రెడ్ల సుశీల పలువురు కవులు పాల్గొన్నారు.

శ్రీ సత్య సాయి బాబా శతవర్ష జన్మదినం

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : స్థానిక ఈడేపల్లి భగ వాన్ శ్రీ సత్యసాయి బాబా వారి మందిరం నందు శ్రీ సత్య సాయి బాబా శతవర్ష జన్మదిన వేడుకల్లో భాగంగా "సంపూర్ణ భగవద్గీత పారాయణం" కార్యక్రమాన్ని 280 మంది సామూ హికంగా 700 శ్లోకాలను చదివే కార్యక్రమాన్ని నిర్వహించ డంతో పాటు పోతుకూచి ఆంజనేయ కుమార్, నాగమణి దంపతులచే గీతా పూజ, సత్యసాయి భగవాన్ పూజను బ్రహ్మశ్రీ పాతూరి జ్ఞానేశ్వర శర్మ నిర్వహించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు కొమరగిరి చంద్రశేఖర రావు మాట్లాడుతూ ప్రతి నెల ఏదో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మహిళలందరూ పాల్గొని స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలని తెలిపారు. సమితి కన్వీనర్ పోతుకుచి ఆంజనేయ కుమార్ మాట్లాడుతూ స్వామివారి శతవర్ష జన్మదిన వేడుకల్లో ఎన్నో ఆధ్యాత్మిక సేవ విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, ప్రతి కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని, స్వామి వారి అనుగ్రహానికి పాత్రులు కావాలన్నారు. శ్రీమతి సామా కుమారి మాట్లాడుతూ భగవద్గీత నేర్చుకోవడమే కాకుండా దానిని అర్థం చేసుకోవాలని తెలిపారు. విద్యా విభాగ సమన్వ య కర్తలు శ్రీమతి కళ్యాణి, పి. వరప్రసాద్, సమయమంతుల వెంకట చెన్నైగుప్తా, కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో గోవర్ధనగిరి రాజు. వై. సాయిబాబు, కూరాళ్ల అనీల్, వై. రాజమోహన్, కాళికాదేవి, కోమలాదేవి, నాగమణి, జ్యోతి, నాగలక్ష్మీ, ప్రశాంతి, నాగమణిలతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పారాయణ అనంతరం నారాయణ సేవ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రోడ్డు మరమ్మతులు చేయాలని నిరసన

విశాలాంధ్ర- కూచిపూడి : మొవ్వ మండలం నిడుమోలు గ్రామం లో జాతీయ రహదారి నుండి ఉప్పలపు వెంకటాద్రి ఇంటి వరకు ఉన్న జిల్లా పరిషత్ రోడ్డు నిర్మాణం చేపట్టి నాలుగు మాసాలు గడుస్తున్నా ఇంతవరకు పూర్తి చేయలేదు. ఈ రోడ్డు 510 మీటర్ల విస్తీర్ణం కలిగి ఉంది. కంకరరాళ్లు పరిచి పూర్తి చేయకుండా వదిలివేయటంతో ప్రజలకు, హైస్కూల్‌కు వెళ్లి వచ్చేవిద్యార్థిని విద్యార్థులకు, హాస్పిటల్, సచివాలయానికి, వెళ్లే ప్రజలకు ఇబ్బందికరంగా ఉంది. ఆటో రిక్షాలు, ద్విచక్ర వాహనాలు ఈ రోడ్డుపై వెళ్లేటప్పుడు రాళ్లు తగులుతాయోనని ప్రజలు భయపడుతున్నారు. ఒక్కొక్కసారి వాహనాలు పడిపోయిన సంఘట నలు ఉన్నాయని కావున వెంటనే అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని

గ్రామస్తులు ఆదివారం రోడ్డుపై నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు మద్దుల బసవ రావు, పార్టీ శాఖ కార్యదర్శి ఉప్పలపు వెంక టాద్రి, సభ్యులు జొన్నలగడ్డ వాసు, కొనకళ్ల రాం బాబు, గ్రామస్తులు కొలుసు శీను, దొక్కు శీను, దొక్కు రాజ్యలక్ష్మి, పామర్తి ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'కొల్లూరికి' జాతీయ సేవ పురస్కారం



విశాలాంధ్ర- పెడన: పెడన పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు డా. కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) కు మరొక అరుదైన అత్యున్నత గౌరవం భారత దేశ ప్రథమ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జాతీయ సేవా పురస్కారం ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నారు. ప్రతిభ క్రీడా సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి అడవి రాజు విశాఖపట్నం జిల్లా పౌర గ్రంథాలయంలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన విశాఖ మాజీ మేయర్ దాడి సత్యనారాయణ దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ విశాఖ కళాపరిషత్ వ్యవస్థాపకులు పీవీ భాస్కరరావు సీనియర్ జర్నలిస్టు నేమాల హేమ సుందర్ రావు ఆంధ్రప్రదేశ్ హైందవ ధర్మ ట్రస్ట్ సేవా అధ్యక్షురాలు విజయ రమణి ప్రోగ్రాం కన్వీనర్ పద్రే నాంచారయ్య తదితరులు డా. కొల్లూరి ని దృశ్యాలువా వస్త్ర కిరీటంతో సత్కరించి ప్రశంసా పత్రంతో పాటు అవార్డును అందజేశారు.

సహకార వ్యవస్థను పటిష్ట పరచాలి

- కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం

విశాలాంధ్ర-విజయవాడ: కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన చైర్మన్ గా నియమితులైన రాష్ట్ర మాజీ మంత్రి నెట్టెం రఘురాం అభినందన సభ ఆదివారం ఏపీ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్, పీఏసీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా సంఘాల నాయకులు సహకార బ్యాంకింగ్ రంగంలో రైతులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకుని వెళ్ళారు. పలు ప్రాంతాల నుండి వచ్చిన సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం రఘురాం మాట్లాడుతూ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్థాపించిన చరిత్ర ఉన్న కేడీసీసీ బ్యాంకు మరింత అభివృద్ధికి తోడ్పడతానని దీర్ఘకాలంగా ఉన్న వేతన సవరణ , శాశ్వత ఉద్యోగాలు, వయసు 62 కు ఉద్యోగ విరమణ వంటి పలు సమస్యల పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. పిన్నమనేని వెంకటేశ్వరరావు, తొండె పు దశరధ జనార్ధన్, వసంత నాగేశ్వరరావు వారి స్ఫూర్తితో అభివృద్ధిలో ముందుకు సాగాలని అన్నారు. కేవి ఎస్ రవికుమార్, బొల్లినేని రఘురాం ల అధ్యక్షతన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వి రాధాకృష్ణ మూర్తి, ఏ ఐ టి యూ సి రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు చలసాని రామారావు, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అక్కినేని ఆంజనేయ ప్రసాద్ సత్యనారాయణ రెడ్డి బుచ్చయ్య చౌదరి పాల్గొన్నారు.

ఓట్లు చోరీపై 17న భారీ ప్రదర్శన

విశాలాంధ్ర-విజయవాడ: దేశంలో పాలక బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఓట్లు చోరీ ఘటనల పై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన ఓట్ చోరీ-గద్దె చోర్ ఆందోళనల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని ఇండియా కూటమి నేతలు పిలుపునిచ్చారు. ఓటు చోరీ వ్యవహారం పై రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న సిపిఎం కార్యాలయం మండేపూడి భవనం నందు నిర్వహించారు. ఈ సమావేశంలో పెనమలూరు నియోజక వర్గ పరిధిలో కూటమి పార్టీల ఆద్వర్యంలో సెప్టెంబర్ 17న ద్రావిడ ఉద్యమ నాయకులు పెరియార్ జయంతి నాడు భారీ ప్రదర్శన తాడిగడప సెంటర్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు నిర్వహించాలని తీర్మానించారు. అలాగే దక్షిణ భారతదేశంలో కూడా అలాంటి ప్రజా ఉద్యమం నిర్మాణం అయ్యేలాగా మనందరం కూడా చైతన్యం అయి సాగవలసిన ఆవశ్య కత ఉందని అన్నారు.ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు పంచకర్ల రంగారావు, కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షులు ఈదర రాజశేఖర్ వర్మ , భుజంగ నాయక్ , బూరగడ్డ ఉదయ్ కుమార్ , సిపిఐ నియోజక వర్గ సహాయ కార్యదర్శి బండి ప్రేమ్ కుమార్ మున్సిపల్ కార్యదర్శి మోతుకూరి అరుణ కుమార్, కాంగ్రెస్ పార్టీ కొసనం రాము , సిపిఐ నాయకులు పాశం రవి కుమార్, పోతురాజు నాగేశ్వరరావుకాంగ్రెస్ పార్టీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షులు బాలాజీ నాయక్, ప్రచార కార్యదర్శి రౌతు రాంబాబు, పచ్చిపాల కోటేశ్వరరావు , హసీనా బేగం ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల ఉద్యోగులకు అండగా ఉంటా

ఏపీ ఎన్జీజీవో అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : వాణిజ్య పన్నుల ఉద్యోగులకు అండగా ఉంటాను అని ఏపీ ఎన్జీజీవో అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ హామీ ఇచ్చారు. ది కమర్షియల్ టాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ స్టేట్ జనరల్ బాడీ మీటింగ్ ఏపీ ఎన్జీజీవో కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సమావేశంలో అసోసియేషన్ కాల పరిమితి(2022-2025) అక్టోబర్ నెలతో ముగియనున్న సందర్భంలో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. గడువులోగా ఎన్నికలను నిర్వహించాలని, గెజిటెడ్ హోదా కలిగిన గూడ్స్ అండ్ సర్వీస్‌టాక్స్ ఆఫీసర్స్‌ను తిరిగి సంఘంలోకి తీసుకురావడానికి ప్రస్తుత సంఘాన్ని సర్వీస్ అసోసియేషన్‌గా మార్పు చేయాలని, అవసరమైన మేరకు సంఘ బైలాస్ నందు మార్పులు చేర్పులు చేయాలని, రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఎన్నికల అనంతరం నిర్వహించాలని ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానించారు. ఏపీ ఎన్జీజీవో అధ్యక్షులు విద్యా సాగర్ పర్యవేక్షణలో రాష్ట్ర సంఘ ఎన్నికలు జరుపుకోవాలని ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులుగా ఇటీవలే ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైన అలపర్తి విద్యాసాగర్‌ను కమర్షియల్ టాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. వీరితో పాటు హాజరైన ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీపీ జగదీష్, ఆల్ ఇండియా ఉమెన్ వింగ్ సభ్యురాలు రాజ్యలక్ష్మిని, విజయవాడ నగర శాఖ అధ్యక్షులు ప్రసాద్ ,కార్యవర్గ సభ్యులను సన్మానించారు. ఈ సమావేశంలో వాణిజ్య పన్నుల నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు భవనారీ వెంకటేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది ఉద్యోగుల ఆశాజ్యోతి గా అలుపెరుగని ఉద్యమ నేతగా ఉద్యోగుల సమస్యల పరిష్కారమే తన ధ్యేయంగా నిజాయితీగా పనిచేస్తూ, ప్రతి ఉద్యోగి సమస్యను ఓర్పుగా వింటూ, నేర్పుగా పరిష్కరిస్తున్న రాష్ట్ర ఏపీ ఎన్జీజీవో అధ్యక్షులుగా ఉండడం ఉద్యోగులందరికీ గర్వకారణమని కొనియాడారు. వాణిజ్య పన్నుల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేసే వారికి అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా అన్నారు. వాణిజ్య పన్నుల శాఖలో2025 బదిలీల సమయంలో ఏర్పడ్డ ఇబ్బందులను తొలగించడంలో కూడా నా వంతు సహకారం అందించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో భవనారి వెంకటేష్ బాబుకు సముచిత స్థానం నా హృదయంలో ఎప్పటికీ ఉంటుందని, ముందస్తు సమాచారం లేకుండా నన్ను కలిసి మాట్లాడే అతికొద్ది మంది వ్యక్తులలో ఒకరిని తెలియజేశారు. ఈ సమావేశానికి విజయవాడ 1&2 డివిజన్ అధ్యక్షులు ప్రవీణ, నాగార్జున, విజయకాంత్, ఎన్ రవి విజయవాడ 3 డివిజన్ అధ్యక్షులు కె ఆర్ఎస్ గణేష్, అడపా రవి, ముని కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాబు షూరిటీ -మోసం గ్యారెంటీ

విశాలాంధ్ర-ఏ కొండూరు : ఏ కొండూరు మండలంలోని అడ్డ రోడ్డు సమీపంలో గల పాలేటి నాగేశ్వరరావు మ్యాంగో మార్కెట్ నందు ఆదివారం బాబు శృతి మోసం గ్యారంటీ కార్యక్రమం తో పాటు వైసిపి మండల సర్వసభ్య సమావేశాన్ని జడ్పిటిసి మండల వైసీపీ అధ్యక్షులు భూక్య గన్యా అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగ తిరువూరు నియోజక వర్గ వైసీపీ సమన్వయకర్త నల్లగట్ల స్వామి దాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా గళం అనే పేరుతో డాక్యుమెంటరీని విడుదల చేసిందని ఇంతవరకు నిరుద్యోగులకు ప్రతి నెల రూ.3వేలు ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయలేక పోయిందన్నారు. 143 హామీలు ప్రజలకు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చంద్రబాబు పవన్ కళ్యాణ్ హామీలు అమలులో ప్రజలకు వెన్నుపోటు పొడిచారని ఆయన అన్నారు. టీడీపీ బిజెపి జనసేన ముప్పేట దాడి చేసి ప్రజలతో ఓట్లు వేయించుకొని నట్టేట ముంచారన్నారు. అమలు కాని హామీలతో ప్రజా సమస్యలను గాలికి వదిలేసి ఈ రోజున ప్రభుత్వం ఇంకా ప్రజలకు కల్లబొల్లి మాటలు చెబుతూ ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తుందని ఆ రోజున ఎన్నికల ప్రచారంలో భాగంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి చెప్పిన విధంగా కూటమి ప్రభుత్వం ఈరోజు సంక్షేమ పథకాలు అందించడంలో విఫలం అవుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కులం మతం చూడకుండా అన్ని వర్గాల వారికి అన్ని పార్టీల వారికి సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం అందించిందని ఆయన చెప్పుకొచ్చారు. అధికారంలోకి వచ్చిన 14 నెలల కాల పరిమితిలోనే రాష్ట్ర ప్రజలకు 19 వేల కోట్ల అదనపు విద్యుత్ భారాన్ని వేసిన ఘనుడు చంద్రబాబు అని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ జనరల్ సెక్రటరీ నరెడ్ల వీరారెడ్డి, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి చెన్నారావు, వజ్రాల బ్రహ్మానందరెడ్డి తిరువూరు నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షుడు టి.సురేష్ వైసిపి నాయకులు తుమ్మారు వెంకటేశ్వ రరెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు సర్పంచులతో పాటు మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు గ్రామ పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సైకిల్ ర్యాలీ

విశాలాంధ్ర-విజయవాడ: క్రీడలు, స్పిరిట్ ఆఫ్ యూనిటీ, విజిలెన్స్ అవగాహన వారం వేడుకల్లో బాగంగా బీఆర్‌టీఎస్ రోడ్డులో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సైకిల్ ర్యాలీని నిర్వహించింది.ఈ ర్యాలీకి రీజియన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ యంవి తిలక్ నాయకత్వం వహించగా, డిప్యూటీ జోనల్ హెడ్ యంవిఎన్ రవిశంకర్, డిప్యూటీ రీజనల్ హెడ్ వి చందన రూప, డిప్యూటీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ వృత్తిపరమైన, వ్యక్తిగత జీవితంలో శారీరక దృఢత్వం , నైతిక బాధ్యత యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అద్భుతమైన బ్యాంకింగ్ సేవలను అందించడమే కాకుండా సామాజిక, సమాజ సంక్షేమ కార్యక్రమాలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు.

అన్న సమారాధన

విశాలాంధ్ర-పెదపారుపూడి : వినాయకుని ఉత్సవాలలో భాగంగా మండలంలోని వానపాముల గ్రామంలో పెదపారుపూడి సాగునీటి సంఘం అధ్యక్షుడు కాగిత లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్న సమారాధన విగ్రహ కమిటీ సభ్యులచే ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో కాగిత ఈశ్వర్, కాగిత సతీష్, కాగిత పవన్, కాగిత పూర్ణ, కాగిత శ్రీనివాస్, కాగిత మహేష్ బాబు, పాగోలు శ్రీనివాసరావు, కనుమూరి బాజీ, మెండం బసవయ్య, రాజులపాటి నాగరాజు, అట్లూరి ఆదిత్య,పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండాలి : సీఐ శ్రీనివాస్

విశాలాంధ్ర-గుడివాడ: అనుకోని కొన్ని సంఘటనల వల్ల, దురుసుగా ప్రవర్తించి, చేడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవదని ఇప్పటికైన మంచి జీవితం గడిపి రౌడీషీటర్ అనే పదాన్ని తొలగుంచుకునేల ఉండాలని వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ సూచించారు. ఆదివారం స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు వినాయక చవితి సందర్భగా ఎంటువంటి అల్లరు జరిగిన వారిపై చర్యలు తీసుకుంటమాని సీఐ శ్రీనివాస్ కౌన్సిలింగ్‌లో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లా పోలీసు సూపరింటెండెంట్ గంగాధర్‌రావు ఆదేశాల మేరకు గుడివాడ సబ్-డివిజినల్ పోలీసు ఆఫీసర్ ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో గుడివాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షిటర్లను కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు.

ఆ 'పూర్వ' కలయిక

విశాలాంధ్ర-విజయవాడ : మచిలీపట్నంలోని చిట్టా బాలకృష్ణ శాస్త్రి మెమోరియల్ హైస్కూల్ 1974-75లో 10 వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 50 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. ఈ అపూర్వ కలయిక హైదరాబాద్ మాదాపూర్‌లోని వారాహి గ్రాండ్ ఆదివారం జరిగింది. కోసూరి మాధవ చీఫ్ ఆర్గనైజేషన్‌లో ఘనంగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, లక్ష్మీ, గౌరీ, నాగేశ్వరరావు, వెంకట రమణ, అజయ్, లక్ష్మీ, విజయ,బాలాజీ మొదలగు వారు కలిశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర-విజయవాడ: సెప్టెంబర్ 1వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాసమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అర్జీదారులు తమఅర్జీలను అధికారిక వెబ్‌సైట్‌లో నందు నమోదు చేసుకోవచ్చని, నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

శిశు సంక్షేమశాఖలో ఉద్యోగాల భర్తీ

విశాలాంధ్ర-విజయవాడ: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వన్ స్టాప్ సెంటర్ (విజయవాడ) నందు సెంటర్ అడ్మినిస్ట్రేటర్ 1, సైకో సోషల్ కౌన్సెలర్ 1 భర్తీ చేసేందుకు గత ఏడాది అక్టోబర్ 16ననోటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్వ్యూలో ఎవరూ అర్హత సాధించనందున తిరిగి నోటిఫికేషన్ జారీచేసినట్లు ఆమె తెలిపారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై పనిచేయుటకు స్థానిక అర్హులైన 18 నుండి 42 సంవత్సరాల వయస్సు గల మహిళా అభ్యర్థులు నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ మహిళలకు 5 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల గరిష్ట వయస్సు సడలింపు ఉంటుందన్నారు. సెప్టెంబర్ 9 వరకు ఆసక్తిగల స్థానిక మహిళా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు డౌన్లోడ్ చేసుకొని. పూర్తిచేసి ధ్రువీకరణ పత్రాల నకళ్ళను గజిటెడ్ అధికారిచే అటెస్ట్ చేయించి ఆ దరఖాస్తులను జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి వారి కార్యాలయం, డోర్ నెంబర్ 31-4-29, గద్దె పూర్ణచంద్రరావు వీధి, మారుతీనగర్ రెండవ లైన్, విజయవాడ అభ్యర్థులు స్వయంగా సమర్పించాలన్నారు.

5వ రోజు శ్రీ పంచముఖ స్వామి దర్శనం

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం గణపతి నవరాత్రి మహోత్సవాల భాగంగా 5వ రోజు శ్రీ పంచముఖ స్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో దేవస్థాన ఈవో యార్లగడ్డ శ్రీనివాస రావు (వాసు), దేవ స్థాన ధర్మకర్తల కమిటీ చైర్మన్ సాయిన రాజేష్, సభ్యులు లోయవాసు, ముళ్ళపూడి రమణమూర్తి, విక్కుర్తి పోతురాజు, పంచమర్తి శ్రీనివాసరావు, సాసుపల్లి శారద, వీరమాచినేని శైలజ, చాపరాల విజలక్ష్మి, గొంతుపూడి కనకదుర్గా భవాని పాల్గొన్నారు.

'సురవరం' ఉద్యమ శిఖరం

విశాలాంధ్ర-తిరువూరు: భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకుడు సురవరం సుధాకరరెడ్డి ఉద్యమ శిఖరమని పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా పూర్వపు కార్యదర్శి పసుపులేటి వెంకయ్య పేర్కొన్నారు. సీపీఐ తిరువూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సుంకర వీరభద్ర భవనంలో జరిగిన సురవరం సంతాపసభలో పలువురు నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో వెంకయ్య మాట్లాడుతూ, తిరువూరు ఉద్యమాలకు సుధాకర్‌రెడ్డి ఉద్యమ పటిమ, నిరుపమాన సేవలను వివరించారు. రాష్ట్రానికే తలమానికమైన కనిమెల్ల పర్వతాపురం భూ పోరాటానికి ఆనాటి అటవీ, పోలీస్ దౌర్జన్యాలను ఖండిస్తూ డిఎఫ్ఓ శంభోజీరావు అకృత్యాలకు నిరసనగా విజయవాడ నగరంలో వేలాదిమంది గ్రామీణ శ్రమ జీవులతో జరిపిన మహత్తర ర్యాలీ, సభలో అధికారుల దుశ్చర్యలను ఖండిస్తూ ఆయన చేసిన హెచ్చరికను గుర్తు చేశారు. అలాగే కనిమెర్ల పోరాటదారులు వందలాది మందిపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని తిరువూరు కోర్టు ఎదుట వేలాది మందితో జరిపిన ప్రదర్శన. సభ చివరకు ఆ కేసులను మేజిస్ట్రేట్ బహిరంగంగా విచారణ నిర్వహించి మొత్తం కేసులను కొట్టివేయడం సుధాకర్ రెడ్డి పట్టుదలకు నిదర్శనమని శ్లాఘించారు. 1974 నుండి సుధాకర్ రెడ్డితో తనకున్న ఉద్యమ అనుభవాలను వివరించారు. ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య మాట్లాడుతూ తాలూ కాలో జరిగిన భూ పోరాటాలన్నిటికి ఆయన అందించిన సహాయ సహకారాలను కీర్తించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్ కె నాగుల్ మీరా సుధాకర్ రెడ్డి సేవలను కొనియాడారు. ఈ సభలో ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి వనమాలి , జిల్లా యువజన సమాఖ్య కార్యదర్శి షేక్ సుభాని, నియోజకవర్గ ఏఐటీయూసీ అధ్యక్షుడు ఎస్.కె.మీరా పాల్గొన్నారు. ప్రజా నాట్యమండలి గాయకులు బొమ్మసాని రవిచంద్ర విప్లవ గేయాలను ఆలపించారు.

యోగాతో ఆరోగ్యం

- జిల్లా యోగాసన పోటీలను ప్రారంభించిన కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే బొండా ఉమా

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ప్రతి ఒక్కరూ యోగాను చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ చెప్పారు. కృష్ణా జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ హరిత సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆవరణలో ఉన్న ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి యోగాసన పోటీలు జరిగాయి. సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు గారు ముఖ్యఅతిధిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ ఐఎఎస్ ఆయన మాట్లాడుతూ జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమానికి చాలా చక్కగా నిర్వహించి వరల్డ్ రికార్డును కూడా నమోదు చేశామన్నారు. యోగాను ప్రతి రోజూ సాధన చేయడం ద్వారా శారీరకంగా ఆరోగ్యంగా ఉండటమే కాకుండా మానసికంగా కూడా చాలా ప్రశాంతంగా ఉండవచ్చునని చెప్పారు. రోజులో కనీసం ముప్పై నిమిషాలు యోగా చేయడం ద్వారా చేసే పనిలో నైపుణ్యం పెరుగుతుందన్నారు. చక్కటి ఆరోగ్యానికి యోగా రామభాణం వంటిందని అన్నారు. ప్రస్తుతం పోటీ ప్రపంచంలో అభివృద్ధి వేగంగా జరుగుతుందని, అభివృద్ధితో పాటుగా వచ్చే నెగెటివ్ వేవ్స్ నుంచి తప్పించుకోవాలంటే యోగా ఒక్కటే మార్గమని చెప్పారు. పాఠశాల స్థాయి నుంచే యోగాను విద్యార్థులతో సాధన చేయించాలని కలెక్టర్ అన్నారు. సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ యోగా అనేది భారతీయుల రక్తంలోనే ఉందన్నారు. చదువుతో పాటుగా యోగాపై కూడా దృష్టి పెట్టాలన్నారు. మా ప్రభుత్వం యోగాకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అందర్నీ ఆరోగ్యంగా చేయటంలో చాలా ప్రాధాన్యత ఇస్తుంది దీని కొరకు మన జిల్లా అధికారులు కలెక్టర్ మరియు వివిఎంసి కమిషనర్ మన పోలీస్ కమిషనర్ మిగిలిన అధికారులు యోగా సాధన ద్వారా అందరికీ చక్కటి ఆరోగ్యాన్ని అందిస్తున్నారు యోగాలో అంకాల సత్యనారాయణ తనకు గురువు అని చెప్పారు. అన్ని వయస్సుల వారు యోగా సాధన చేయా లన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ వీవీపీ ఎస్ ఆంజనేయులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా చక్కటి ఆరోగ్యానికి దోహదం చేసే యోగాసనాల పోటీలను నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. క్లబ్ కార్యదర్శి కాకాని శ్రీనివాసరావు, కోశాధికారి తిరుమల రావు, యోగా గురువు అంకాల సత్యనారాయణ, మాజీ కార్పోరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, మాజీ డి ఎస్ డి ఓ శాప్ యోగా కోచ్ ఆర్.రవి, కృష్ణాజిల్లా ఎన్టీఆర్ కంబైన్డ్ డిస్ట్రిక్ట్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్.మురళీకృష్ణ, గుంటూరు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైత్రి, డి.ధీరజ్ శ్రీకృష్ణ సాలెం రాజు చేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు, వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు నూకల సాంబశివరావు, లయన్స్ జిల్లా సెకండ్ వైస్ గవర్నర్ ప్రసాద రెడ్డితో పాటుగా ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి అధిక సంఖ్యలో యోగ సాధకులు హాజరై ఆసనాలు ప్రదర్శించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం: సెప్టెంబర్ 1వ తేదీ సోమవారం 10.30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే. బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. రపజలకు పాలన మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం కార్యక్రమం జరుగుతుందని, అర్జీలు అందచేయవచ్చున్నారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాల్లో అందచేయవచ్చని తెలిపారు. మీకోసం కాల్ సెంటర్ నెంబర్ 1100 కు ప్రజలెవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతో పాటు అర్జీ స్థితిని తెలుసుకోవచ్చని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

రూ.6.81 లక్షలకు లడ్డూను దక్కించుకున్న కిరణ్ రెడ్డి

విశాలాంధ్ర-తాడేపల్లి : తాడేపల్లి మండలం ప్రాతూరు, కుంచనపల్లి క్రాస్ రోడ్‌లోని అపర్ణ అమరావతి వన్ అపార్ట్‌మెంట్ సముదాయంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 5 రోజులపాటు వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం నిర్వహించిన లడ్డూ వేలం పాట తీవ్ర పోటీ మధ్య రూ.6.81 లక్షలకు లడ్డూను కొండూరి కిరణ్ రెడ్డి, శ్రీలత దంపతులు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లడ్డూ దక్కించుకోవడం తమకు చాలా ఆనందంగా ఉందని, విఘ్నేశ్వరుని ఆశీస్సులు తమకు ఎప్పుడూ ఉండాలని తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏటా గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, భక్తిశ్రద్ధలతో వినాయకునికి పూజలు నిర్వహించి, అందరం కలిసి సోదరభావాన్ని పెంపొందిస్తూ, సంప్రదాయాలను కాపాడటమే తమ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాజేష్, సెక్రెటరీ రాకేష్, జాయింట్ సెక్రెటరీ రత్నసాగర్, ట్రెజరర్ బ్రహ్మారావు, సభ్యులు రఘురాం, షబ్బీర్, కళ్యాణ్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసిన వారికి గుర్తింపు

విశాలాంధ్ర-తుళ్లూరు : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన వారికి సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం ఉంటుందని తుళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. తుళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్ఎన్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన నల్లూరి అంజమ్మ దంపతులకు హెచ్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజమ్మ పనితీరును పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి బీటీ నాయక్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేవీవీ ప్రసాద్, సీపీఐ రాష్ట్ర నాయకులు వై.చెంచయ్య, ఈశ్వరయ్య, టీసీ హెచ్.చెన్నయ్య, ఆరోగ్య సిబ్బంది, బంధువులు, రక్తసంబంధీకులు, స్నేహితులు పాల్గొన్నారు.

ఉత్సవాలు సామరస్యానికి ప్రతీక

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఉత్సవాలు సామరస్యానికి ప్రతీక అని, ప్రతిఒక్కరూ సంతోషంగా నిర్వహించుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ పేర్కొన్నారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన మండపాలను ఆదివారం ఎమ్మెల్యే నసీర్ దర్శించుకున్నారు. ఆయా మండపాల వద్ద ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక విగ్రహాల ఏర్పాటు ద్వారా ఐకమత్యం పెరుగుతుందని తెలిపారు. ఒక వీధిలో వారు తామంతా ఒకటేననే భావన కలుగుతుందని చెప్పారు. వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ అందించడం ద్వారా ప్రతిఒక్కరూ కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్నారని అన్నారు. వినాయక నిమజ్జన సమయంలో ఎంతో సమన్వయంతో వ్యవహరించాలని, యువత క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. అప్పుడే సంబరాలను ఆనందంగా నిర్వహించుకోగలుగుతారని చెప్పారు.

ఐరా హార్ట్ అండ్ పాలీ క్లినిక్‌లో గర్భిణీలకు వైద్య శిబిరం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : తల్లి ఆరోగ్యం, శిశువు భవిష్యత్తు కోసం ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఈ దిశగా గుంటూరు నగరంలోని ఆనందపేట 10వ వీధి పంచవటి అపార్ట్‌మెంట్ల సమీపంలో ఉన్న ఐరా హార్ట్ అండ్ పాలీ క్లినిక్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు ఉచిత వైద్య శిబిరం ప్రారంభమైంది. ఈ శిబిరం సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు కొనసాగనుంది.

గర్భిణీ స్త్రీలకు ఒకే వేదికపై వివిధ నిపుణుల వైద్య సేవలు అందించడానికి ఈ కార్యక్రమం ప్రత్యేకంగా రూపొందించబడింది. ఇందులో ప్రసూతి నిపుణులు డాక్టర్ షేక్ సాజిదా, హృదయ నిపుణులు డాక్టర్ అఖిఫ్ అహ్మద్ బేగ్, సాధారణ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎం.ఎ. సమీనా ఫరహీన్ కలిసి సేవలందిస్తున్నారు. గర్భధారణ సమయంలో తల్లి శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయని, నిర్లక్ష్యం చేస్తే తీవ్ర ప్రభావం చూపుతాయని హెచ్చరించారు.

కోలాహలంగా గణేష్ నిమజ్జనం

విశాలాంధ్ర-దుర్గి : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మండల కేంద్రమైన దుర్గి ఆర్‌సీఎం పాఠశాల వద్ద టీడీపీ నాయకులు సింగు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గణనాథుని ప్రతిమను ఏర్పాటు చేశారు. మాచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ రాజబోయిన మధు యాదవ్, వైస్ ఛైర్మన్ గుండాల శ్రీనివాస్ యాదవ్, నియోజకవర్గ యువ నాయకులు జూలకంటి అక్కిరెడ్డి, కుర్రి శివారెడ్డి గణనాథుని ఉత్సవాల్లో పాల్గొన్నారు. మండపంలో విఘ్నేశ్వరుడుకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి వినాయకుని చేతిలోని లడ్డూ ప్రసాదం, మెడలో ఉన్న కరెన్సీ నోట్ల దండ, పుస్తకం, పెన్నుకు వేలంపాట నిర్వహించారు. యెల్లబోయిన రాంబాబు అందరి కంటే రూ.25 వేలు హెచ్చుపాట పాడి లడ్డూ కైవశం చేసుకున్నాడు. సింగు నాగేశ్వరరావు అందరి కంటే రూ.5 వేలు హెచ్చుపాట పాడి కరెన్సీ నోట్ల దండను దక్కించుకున్నాడు. కరెంటు గోపాల్(గ్రె.గోపాల్) అందరి కంటే రూ.650లు హెచ్చుపాట పాడి లంబోదర ప్రతిమ ముందు ఉంచిన పుస్తకం, పెన్ను దక్కించుకున్నారు. మహిళల్లో ఉత్సాహం నింపేందుకు నెంబర్లు కలిగిన సీట్లు మహిళలకు పంపిణీ చేసి లాటరీ తీశారు. ఆ లాటరీలో అక్కెం సైదమ్మ మొదటి ఫ్రైజ్ దక్కింది. ఆమెతో పాటు 11 మంది మహిళలకు నిర్వాహకులు చీరలు అందజేశారు. ఆదివారం గణేష్ ఉత్సవ నిర్వాహకులు నేతృత్వంలో లడ్డూ ప్రసాదం, నోట్లదండ, పుస్తకం, పెన్ను దక్కించుకున్న భక్తులకు బ్యాండు, మేళతాళాల నడుమ వారివారి ఇంటికి చేర్చారు. అనంతరం మండపంలో ఏర్పాటు చేసిన గణనాథుని ప్రతిమను ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించి, మండపం నుంచి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం ప్రారంభమైంది. డీజే సౌండ్ సిస్టం, సీని, భక్తి గీతాలతో రంగురంగుల గులాల్‌లు చల్లుకుంటూ మహిళలు మేము సైతం అంటూ సందడి వాతావరణంలో ఊరేగింపు సాగింది. భక్తుల భక్తి గీతాల మధ్య, గణపతి బప్పా మోర్యా నామస్మరణ గ్రామం అంతా మార్మోగింది. కరెంటు గోపాల్ 50 కేజీల లడ్డూ ప్రసాదం ప్రతిమ ఊరేగింపులో భక్తులకు పంచిపెట్టారు. యార్డు ఛైర్మన్ రాజబోయిన మధు యాదవ్ ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నానని అన్నారు. యువ నాయకులు జూలకంటి అక్కిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనేలా ఇలాంటి ఉత్సవాలు ఎంతో తోడ్పడతాయని అన్నారు. ఊరేగింపుగా అడిగొప్పల సమీపాన ఉన్న నాగార్జున సాగర్ కుడికాల్వలో గణనాథుని నిమజ్జన కార్యక్రమం కోలాహలం జరిగింది. ఈ కార్యక్రమంలో దుర్గెంపూడి జానికీరామయ్య, యాగంటి నరేష్, యెల్లబోయిన సుబ్బారావు, గుమ్మా ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, మాభాష, సింగు నాగేంద్ర బాబు, బొబ్బె చిన్న సైదులు, సూరె క్రిష్ణ, రాయపాటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-దుగ్గిరాల : రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం తెనాలి ఆధ్వర్యంలో దుగ్గిరాల మండలం మోరంపూడి గ్రేటనాల్టీస్‌లో కుష్టు వ్యాధిగ్రస్తులకు ఆదివారం బెడ్లు,దిండులు,దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న క్లబ్ గవర్నర్ డాక్టర్ రాంప్రసాద్ పాల్గొని వ్యాధిగ్రస్తులకు అందజేశారు.అనంతరం జరిగిన సభలో రాంప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలకు సహాయం అందించాలని,దాతల సహకారం మరువలేనిదన్నారు.కరోనా సమయములో ఎన్నో సేవలు చేశామని,రోటరీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రజలకు చేసే సేవలకు పుణ్యం ఉంటుందన్నారు.గ్రేటనాల్టీస్ డైరెక్టర్ వంగర హేమచంద్ మాట్లాడుతూ సేవలు చేయాలంటే ఈ రోజుల్లో ఎంతో ఇబ్బందిగా ఉందని రాజకీయ ప్రమేయం ఉన్నందువలన కొన్ని ఇబ్బందులు పడుతున్నామన్నారు.గత 40 సంవత్సరాల నుంచి గ్రేటర్ ఇస్తారా కుష్ఠువ్యాధిగ్రస్తులకు సేవలు చేస్తూ వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర పూర్ణచంద్,క్లబ్ ప్రెసిడెంట్ ఎన్.వెంకటేశ్వరరావు, సెక్రెటరీ వెంకటనారాయణ,క్లబ్ సభ్యులు,గ్రేటాల్టీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గణేశుని ఊరేగింపు

విశాలాంధ్ర-తాడేపల్లి : విఘ్నేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి కోలా సుబ్బారావు రోడ్‌లో ఏర్పాటుచేసిన వినాయకుని ఊరేగింపు కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శెట్టి కేశవరావు, పానకాల సాంబశివరావు, లోకం దుర్గారావు, విజయ్ కృష్ణ, మధు, సతీష్, నాగేశ్వరరావు, లీలా కృష్ణ, రాజేష్, కె.శ్రీనివాసరావు, సూర్యనారాయణ, సిరిగిరి విజయ్ కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల మాధ్యమం విశ్వ విజేతలను చేస్తుంది

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: మాతృభాషతో పాటు అంతర్జాతీయ సంబంధాలను, విజ్ఞానాన్ని అందిపుచ్చుకొని విశ్వ విజేతలుగా గుర్తింపు పొందాలంటే ఇంగ్లీష్ భాష పై చక్కటి అవగాహన పట్టు సాధించాలని అలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని "మేక్ యువర్ బేబీ జీనియస్" సంస్థ డైరెక్టర్ ఎస్.అశ్విని పేర్కొన్నారు. స్థానిక నగరంపాలెం ప్రజ్ఞ మెడి టెక్నో పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులకు ఆంగ్లంలో చదవడం వ్రాయటంపై ఒక్కరోజు ఉన్నత స్థాయిలో ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న అశ్విని మాట్లాడుతూ తమ సంస్థ "భాస్కర్ రాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్, తిరుపతి" ఆధ్వర్యంలో రెండు, మూడు తరగతులు చదివే విద్యార్థులు పదవ తరగతి పుస్తకాలను అలవోకగా చదివి ఆకళింపు చేసుకునేలా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. రీసెర్చ్ సెంటర్ వ్యవస్థాపకులు భాస్కర్ రాజు మాట్లాడుతూ అశ్విని చిన్నప్పటినుండే 21 భాషలలో అనర్గళంగా మాట్లాడటంతో పాటు ఎడమ కుడి చేతులతో ఒకేసారి వ్రాయగలిగే నేర్పును సంపాదించిందన్నారు. సదస్సుకు పాఠశాల కరస్పాండెంట్ నాయుడు చక్ర నాగ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ మాతృభాష తెలుగుతో పాటు ఇంటర్నేషనల్ కమ్యూనికేషన్స్ లాంగ్వేజ్ అయిన ఇంగ్లీషు పై కూడా అంతే స్థాయిలో తమ విద్యార్థులు రాణించేలా శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం శిక్షకులు అశ్విని, భాస్కర్ రాజు లను శాలువాలు, పూలదండలు, బొకేలు, నూతన వస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో రాఘవయ్య మాస్టారు, పాఠశాల ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకతను కోల్పోతున్న ఎన్నికల కమిషన్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : భారత ఎన్నికల సంఘం గత దశాబ్ద కాలంగా స్వయం ప్రతిపత్తిని కోల్పోతూ పారదర్శకంగా జవాబుదారీతనంతో వ్యవహరించడం లేదని ప్రముఖ న్యాయ కోవిదులు, సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. దివాకర్ బాబు విమర్శించారు. రాజ్యాంగ చర్చా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం 'రాజ్యాంగం-భారత ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తి' అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి రాజ్యాంగ చర్చా వేదిక అధ్యక్షులు నడింపల్లి గురుదత్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సీహెచ్ దివాకర్ బాబు మాట్లాడుతూ రాజ్యాంగంపై నమ్మకం, విశ్వాసం లేని వాళ్ళు నేడు పాలకులుగా కొనసాగుతూ రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారత ఎన్నికల కమిషన్ సభ్యుల ఎంపిక ప్రక్రియ త్రిసభ్య కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తిని తొలగించి, ఆ స్థానంలో మరో కేంద్ర మంత్రిని పెట్టడం ద్వారా ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కోల్పోయే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆరోపించారు. బీహార్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ హడావిడిగా ప్రత్యేక సమగ్ర సవరణ ద్వారా 65 లక్షల ఓట్లను తొలగించడం, ఆధార్ కార్డును పరిగణనలోకి తీసుకోకుండా జనన ధ్రువీకరణ లాంటి పత్రాలను కోరడం హాస్యాస్పదమన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ 100 కోట్లకు పైగా ఓటర్లు ఉన్న భారతదేశంలో ఎన్నికల కమిషన్ కు దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో సొంత సిబ్బంది ఉండాలన్నారు. ఓటర్ల జాబితా స్వచ్ఛంగా ఉంటే ప్రజాస్వామ్యం వికసిస్తుందని, ఓటర్ల జాబితా రూపకల్పనలో ప్రత్యేక శ్రద్ధ ఎన్నికల కమిషన్ తీసుకోవాలన్నారు. 130వ రాజ్యాంగ సవరణ అమలులోకి రాకుండా ప్రతి ప్రజాస్వామ్యవాది ఉద్యమించాలన్నారు. వేలాది కోట్లు బ్యాంకులకు ఎగ్గొట్టే నేర చరిత్ర గల దాదాపు 25 మందిని బిజెపి పార్టీలోకి చేర్చుకొని వారిని పునీతులను చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. ఆధార్ కార్డును ఓటరు కార్డుకు అనుసంధానం చేస్తే అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. రాజ్యాంగ చర్చా వేదిక అధ్యక్షులు నడింపల్లి గురుదత్ మాట్లాడుతూ రాజ్యాంగ మౌలిక స్వరూపానికి భంగం కలగకుండా రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కోరారు. రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి మాట్లాడుతూ కాగ్, యూపీఎస్సీ, ఎన్నికల కమిషన్ లాంటి రాజ్యాంగ బద్ధ సంస్థలలో అధికార పార్టీల జోక్యం ఉండరాదన్నారు. రాజ్యాంగ చర్చా వేదిక సంయుక్త కార్యదర్శి డాక్టర్ టి.సేవ కుమార్, ప్రోగ్రెసివ్ ఫోరమ్ అధ్యక్షులు పి. మల్లికార్జునరావు, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, నళిని కాంత్, సామాజిక విశ్లేషకులు టి.ధనుంజయ రెడ్డి తదితరులు ప్రసంగించారు.

టాటా ర్యాలీస్ ఇండియా లిమిటెడ్ నుంచి డోడ్రియో

విశాలాంధ్ర -విజయవాడ (వన్ టౌన్): డోడ్రియో ఉత్పత్తి మార్కెట్లోకి విడుదల సందర్భంగా భారతీయ అగ్రి ఇన్పుట్ల పరిశ్రమలో అగ్రగామిగా ఉన్న ర్యాలీస్ ఇండియా లిమిటెడ్, (టాటా ఎంటర్ ప్రైజస్) వరిలో పాము పొడ తెగులు నివారణకు డిడ్రోయో అనే కొత్త ఉత్పత్తిని ప్రారంభించినట్లు ప్రకటించింది. మార్కెట్లో శిలీంద్ర నాశన విభాగంలో పేరుగాంచిన టాటా ర్యాలీస్ ఇండియా లిమిటెడ్ తన శిలీంద్ర నాశన ఉత్పతులలో పాముపొడ వంటి తెగుళ్ళనుండి పంటను రక్షించే వ్యవసాయ పరిష్కారాన్ని ప్రవేశపెట్టడం తప్పనిసరి అని టాటా ర్యాలీస్ భావించింది. ర్యాలీస్ ఇండియా లిమిటెడ్ అందిన "గోప్ప భద్రత శక్తివంతమైన సాంకేతికతతో కూడిన డోడ్రియో మూడు రసాయనాల శక్తితో కూడుకున్నది. ర్యాలీస్ ఇండియా లిమిటెడ్ తరుపున ముఖ్య అతిధిగా విచ్చేసిన పి. రాజా, హెడ్, సౌత్- ఈస్ట్ సేల్స్ మాట్లాడుతూ కాంటాఫ్ మరియు కాంటఫ్ ప్లస్ మొట్టమొదటిసారిగా ద్రవ రూపంలో మార్కెట్లోకి తీసుకొని రావటమనేది ర్యాలీస్ తో సాధ్యమైనదని పేర్కొన్నారు. మార్కెట్లోకి వచ్చిన తరువాత ఈ ప్రోడక్ట్ ఒక ఊపు ఊపినది అని, ఈ పోటీ రంగంలో ఇప్పుడికి వేరే ప్రోడక్ట్స్ వచ్చిన కూడా రైతులు గుర్తుపెట్టుకొని మరీ కాంటఫ్ మరియు కాంటఫ్ ప్లస్ ని డీలర్స్ వద్ద అడుగుతున్నారంటే ఇది ఎవరగ్రీన్ ప్రోడక్ట్ అని, ఇది కేవలం ఒక ఉత్పాదన కాదు, ఒక వారసత్వం. ప్రతి తరం నమ్మకం అని గర్వము పేర్కొన్నారు. ర్యాలీస్ ఇండియా లిమిటెడ్ సౌత్- ఈస్ట్ మార్కెటింగ్ హెడ్ వై. రవికృష్ణ, మాట్లాడుతూ, "పొడ తెగులు నివారణకు మార్కెట్లో అనేక రసాయనాలు ఉన్నప్పటికీ డిడ్రోయో మిగిలిన వాటికి భిన్నమైనది. దీనిని వాడే పద్దతి పరంగా, ఈ విభాగంలో ప్రత్యేక స్థానాన్ని పొందుతుంది" అని పేర్కొన్నారు.

కోలాహలంగా గణేష్ నిమజ్జనాలు

విశాలాంధ్ర -పమిడిముక్కల: వినాయక నవరాత్రులు భాగంగా ఐదవ రోజు శ్రీ వరసిద్ధి వినాయకుని నిమజ్జన కార్యక్రమాలు పలు గ్రామాలలో కోలాహలంగా జరిగాయి. ఈ సందర్భంగా అయినంపూడి హనుమంతపురం వీరంకిలాకు కృష్ణాపురం తదితర గ్రామాలలో గణేష్ నిమజ్జనం లో డప్పుల వాయిద్యాలతో మహిళలు యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం వీరంకిలాకు లో బందరు కాలువ లో గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా గిడుగు రామమూర్తి జయంతి

విశాలాంధ్ర-తిరువూరు:తెలుగు భాష, సంస్కృతి, కళల పరిరక్షణకు కృషి చేస్తున్న తిరువూరు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ,అరసం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి రేపాక రఘునందన్ కు వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు తేజం జాతీయ ప్రతిభా పురస్కారాన్ని ప్రపంచ తెలుగు సాహిత్య, సాంస్కృతిక అకాడమీ , తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం మరియు వరల్డ్ పొయిట్రీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పల్నాడు జిల్లా నరసరావుపేట లోని భువన చంద్ర టౌన్ హాల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, కార్యక్రమ నిర్వాహకులు ఈశ్వరీబాయి, జాతీయ ప్రధాన కార్యదర్శి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. రఘునందన్ కు పురస్కారం లభించడం పట్ల తిరువూరు రచయితల సంఘం అధ్యక్షురాలు ఉయ్యూరు అనసూయ, కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

విశాలాంధ్ర - చల్లపల్లి: సమాజంలో పేదరిక నిర్మూలన విద్యతోనే సాధ్యమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం చల్లపల్లి మండలం పురిటిగడ్డలో ఐవీఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన ఇంజినీరింగ్ విద్యార్థులకు లాప్ టాప్స్, యూనివర్సిటీ విద్యార్థులకు స్కాలర్ షిప్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ విచ్చేసి మాట్లాడుతూ సర్వ మతాలు దాతృత్వాన్ని ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. పొరుగువారికి సహాయపడమని ఏసుక్రీస్తు బోధిస్తున్నారని తెలిపారు. దివిసీమ ఉప్పెన అనంతరం తన తండ్రి మండలి వెంకట కృష్ణారావు చేపట్టిన దివిసీమ పునర్నిర్మాణ కార్యక్రమాల్లో ప్రపంచ దేశాల నుంచి వచ్చిన క్రైస్తవ సంస్థల సేవలు మరువలేనివి అన్నారు.. అనాధ, పేద బాల బాలికలను ప్రోత్సహించి వారికి ఫీజులు చెల్లించి కార్పొరేట్ విద్య అందిస్తున్న తీరు స్ఫూర్తిదాయకం అన్నారు. నాణ్యమైన ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూ పేద విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న సురేష్ - రోజా దంపతులు ఆదర్శనీయులు అన్నారు. ప్రకృతి విపత్తులు కరోనా, వరదలు సంభవించినప్పుడు ఐవీఎం ట్రస్ట్ ద్వారా బాధితులకు సురేష్ రోజా అండగా నిలిచిన తీరు మరువలేనిది అన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ మాట్లాడుతూ ఐవీఎం ట్రస్ట్ ద్వారా ప్రతి ఏటా వందలాది మంది ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఐవీఎం సురేష్ ప్రశంసనీయులు అన్నారు. ఈ సందర్భంగా ఐవీఎం ట్రస్ట్ ద్వారా ఇంటర్, ఇంజినీరింగ్, మెడిసన్, డిప్లమో, ఎంబీఏ, ఎంసీఏ తదితర కోర్సులు చదువుతున్న వంద మంది పేద విద్యార్థులకు రూ.40లక్షలు స్కాలర్ షిప్ అంద చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్న 175 మంది ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు రూ.ఇరవై లక్షలు స్కాలర్ షిప్ అందచేశారు. 15 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.ఏడు లక్షల తో లాప్ టాప్స్ బహుకరించారు. ఈ సందర్భంగా అతిధులను సురేష్ - రోజా దంపతులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐవీఎం ప్రతినిధులు వేములపల్లి విజయమ్మ, వేములపల్లి స్విటిన్ రాస్, వేములపల్లి సోఫీ, టీడీపీ మండల అధ్యక్షులు, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, స్వచ్ఛ ఏపీ మిషన్ రాష్ట్ర డైరెక్టర్ బోలెం నాగమణి, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, చల్లపల్లి ఉప సర్పంచ్ ముమ్మనేని రాజ కుమార్ (నానీ), టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, డాక్టర్ జయప్రసాద్, ఫణి, సీఐ కే.ఈశ్వరరావు, ఎస్ఐ పీ.ఎస్.వీ సుబ్ర హ్మణ్యం, పీఏసీఎస్ చైర్మన్ గుత్తికొండ వంశీకృష్ణ, మాజీ చైర్మన్ హనుమానుల బెనర్జీ, విశ్రాంత డీఎస్పీ కే.హరి రాజేంద్రబాబు పాల్గొన్నారు.

ఘనంగా టాటా రాలీస్ ఇండియా లిమిటెడ్ కంటాఫ్ వేడుకలు

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : టాటా ర్యాలీస్ ఇండియా లిమిటెడ్, (టాటా ఎంటర్ ప్రైజస్) కంటాఫ్, కంటాఫ్ ప్లస్ 30 వసంతాలు వేడుకలు నగరంలోని హెూటల్లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా వరిలో పాముపొడ తెగులు నివారణకు డిడ్రోయో అనే కొత్త ఉత్పత్తిని ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. భారతదేశంలో వరి అత్యంత ముఖ్యమైన ఆహార పంటలలో ఒకటన్నారు. నాణ్యమైన గింజలున్న కంకులు లభిస్తాయి. డోడ్రియో వాడే సమయం నాట్లు వేసిన 30 నుండి 55 రోజుల్లో వాడాలన్నారు ర్యాలీస్ ఇండియా లిమిటెడ్ తరుపున ముఖ్య అతిధిగా విచ్చేసిన పి. రాజా, హెడ్, సౌత్- ఈస్ట్ సేల్స్ మాట్లాడుతూ కాంటాఫ్, కాంటఫ్ ప్లస్ మొట్టమొదటిసారిగా ద్రవ రూపంలో మార్కెట్లోకి తీసుకొని రావటమనేది ర్యాలీస్ తో సాధ్యమైనదని పేర్కొన్నారు. మార్కెట్లోకి వచ్చిన తరువాత ఈ ప్రోడక్ట్ పోటీ రంగంలో ఇప్పుడికి వేరే ప్రోడక్ట్స్ వచ్చిన కూడా కాంటఫ్, కాంటఫ్ ప్లస్ ని డీలర్స్ వద్ద ఎవరగ్రీన్ ప్రోడక్ట్ అన్నారు. ఇది కేవలం ఒక ఉత్పాదన కాదు, ఒక వారసత్వం. ప్రతి తరం నమ్మకం అని గర్వము పేర్కొన్నారు. ర్యాలీస్ ఇండియా లిమిటెడ్ వై. రవికృష్ణ, హెడ్, సౌత్- ఈస్ట్ మార్కెటింగ్ మాట్లాడుతూ పొడ తెగులు నివారణకు మార్కెట్లో అనేక రసాయనాలు ఉన్నప్పటికీ డిడ్రోయో మిగిలిన వాటికి భిన్నమైనదన్నారు. దీనిని వాడే పద్దతి పరంగా, ఈ విభాగంలో ప్రత్యేక స్థానాన్ని పొందుతుందన్నారు. పిచికారీ చేసే మందుల వలన రైతులకు ఖర్చు పెరుగుతోందని, ఈ రోజుల్లో వ్యవసాయ కూలీల కొరత కూడా ఎక్కువగా ఉందన్నారు. రైతులకు ఖర్చులు సమయాన్ని ఆదా చేయడంలో సహాయపడే విభిన్న పరిష్కారాన్ని తీసుకురావడం ద్వారా డిడ్రోయో ఈ సమస్యను పరిష్కరిస్తుంది అని తెలిపారు. కార్యక్రమం అనంతరం పి. రాజా, హెడ్, సౌత్- ఈస్ట్ సేల్స్ చేతులు మీదగా డీలర్లకు మెమోడో అందచేసిన, పుష్పగుచ్ఛం, శెలవా తో సత్కరించారు. ఈ కార్యక్రమం లో ర్యాలీస్ తరుపున శంకర్ రెడ్డి, డివిజనల్ సేల్స్ మేనేజర్, రామిరెడ్డి, డివిజనల్ సేల్స్ మేనేజర్ మరియు ఇతర మార్కెటింగ్ సిబ్బంది, 100 మంది వరకు డీలర్లు పాల్కొన్నారు.

కృష్ణాజిల్లా జూడో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: నగరంలోని ఐలాపురం హెూటల్లో కృష్ణాజిల్లా జూడో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ సీఈవో నామిశెట్టి వెంకట తెలిపారు.ఉంది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ గణేష్ సుబ్బారావు, అధ్యక్షుడు , టి.వి.వి.రమణ కోశాధికారి, షేక్.ఖాజా మస్తాన్ వైస్ ప్రెసిడెంట్, డాక్టర్.గామిడి.శ్రీనివాస్ జాయింట్ సెక్రటరీ ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరయ్యారు.

నూతనంగా ఎన్నికైన సంఘం వివరాలు:

అధ్యక్షుడు డాక్టర్ బొండాడ.రాఘవేంద్రరావు, వైస్ ప్రెసిడెంట్ అంగజాల.హనుమ, ఉపాధ్యక్షుడు పబ్బతి. మధుసూదన, వైస్ ప్రెసిడెంట్ కోరుకొండబట్టర్.శ్రీ హరి, జనరల్ సెక్రటరీ వెంకట్.నామిశెట్టి, జాయింట్ సెక్రటరీలు దనియాల.నాగరాజు, ఆవులమంద.వీర బాబు, జి.స్వరూప రాణి, కోశాధికారి ఉషా రాణి ఎంఎల్, కార్యవర్గ సభ్యులు ఓ.వంశీ సాగర్, జె.నేహశ్రీ, పి. అభిషేక్, చందు, విజే.హర్ష వర్ధన్, బి.హర్ష్ ఎన్నికయ్యారు.

కనదుర్గ మహోత్సం నాటకంకు విశేష జనవాహిణి

విశాలాంధ్ర-గుడివాడ : అతరించి పోతున్న ఆనాటి పౌరణిక నటకాలను ప్రొతహిస్తు జనవాహిణి కనదుర్గ మహోత్సం(మహిషార మర్ధిని) పౌరణిక, పద్య నాటకాలను కూటమి ప్రభుత్వం ప్రొతహించడం వల్ల కళాకారులకు మళ్ళి జీవనం మెరుగు పడుతుయని కళాకారుల సమైఖ నాయకులు శ్యామ్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక ఏలూరు రోడ్డులోని చిన్న కారులు స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ఓనర్స్, డ్రైవర్స్ అధ్వర్యంలో గణపతి నవరాత్రుల పురష్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, మరియు సంస్కృతి సమితి విజయ వాడ సౌజన్యంతో శ్రీ నవ్యకళా అధ్యక్షురాలు జి.శివకుమారి అధ్వ ర్యంలో కనదుర్గ మహోత్సం (మహిషాసురమర్ధిని) పౌరణిక పద్య నాటకం ప్రదర్శించారు. ఈ నాట కంలో ప్రదాన పాత్రదారులు కనదుర్గగా బి.నాగలక్ష్మీ, మహిషా సురీనిగా బి.శ్రీనివాసనాయుడు, నారదునిగా పుప్పాల రంగారావు, చిత్రలేఖగా జి.శివాకుమారి, శంకరునిగా జంక్షన్ అప్పారావు, దేవాంతుకునిగా బి. మోహన్, సిద్దునిగా బి.శోభారాణిల నటన ప్రేక్షకులను అకట్టుకున్నాయి.